


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 02-11-2022 | సంపుటి : 04 | సంచిక : 64 | పేజీలు : 4 | వెల : రూ 3-00


# వైఎస్సార్ అచీవ్‌మెంట్-2022 అవార్డుల ప్రదానం



అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ సాఫల్య-2022' పురస్కారాలను మంగళవారం ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరుసగా రెండో ఏడాది ఈ అవార్డులు అందించారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, విశిష్ట అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆత్మీయ అతిథిగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'మహనీయుల సేవలకు వందనం. సామాన్యుల్లో ఉన్న అసామాన్యులకు.. అసామాన్య సేవలు అందిస్తున్న మానవతా మూర్తులకు వందనం. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో అవార్డులు ఇస్తున్నాం. సంస్కృతి, సంప్రదాయాలకు వారధులుగా ఉన్నవారికి అవార్డులు అందజేస్తున్నాం. వెనకబాటు, అణచివేత, పెత్తందారీ పోకడలపై దండయాత్ర చేస్తున్న సామాజిక ఉద్యమకారులు, కళలు, పాత్రికేయులు, పారిశ్రామిక దిగ్గజాలకు అవార్డులు అందిస్తున్నాం. ఈ రోజు అవార్డులు అందుకుంటున్న ప్రతి ఒక్కరికీ అభినందలు' అని సీఎం జగన్

## వివిధ రంగాల్లో సేవలందించిన 35 మంది వ్యక్తులు, సంస్థలకు పురస్కారాలు

## 20 వైఎస్సార్ జీవిత సాఫల్య, 10 వైఎస్సార్ సాఫల్య అవార్డులు

## ముఖ్య అతిథిగా గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ఆత్మీయ అతిథిగా వైఎస్ విజయమ్మ హాజరు

## అవార్డుల ప్రదానోత్సవానికి విశిష్ట అతిథిగా సీఎం జగన్





పేర్కొన్నారు. వ్యవసాయం, కళలు-సంస్కృతి, సాహిత్యం, మహిళా, శిశు సాధికారత, విద్య, జర్నలిజం, వైద్యం, పరిశ్రమ రంగాల్లో విశేషకృషి చేసిన 35 మంది వ్యక్తులు, సంస్థలకు 30 అవార్డులను అందజేయనున్నారు. ఇందులో 20 వైఎస్సార్ జీవిత సాఫల్య, 10 వైఎస్సార్ సాఫల్య పురస్కారాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారాల తరహాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'వైఎస్సార్' అవార్డులను అందజేస్తోంది. వ్యవసాయంలో 5, కళలు-సంస్కృతిలో 5, సాహిత్యంలో 3, మహిళా, శిశు సాధికారతలో 3, విద్యలో 4, జర్నలిజంలో 4, వైద్యంలో 5 అవార్డులు, పరిశ్రమల విభాగంలో ఒక అవార్డును ప్రదానం చేయనున్నారు. ఆయా రంగాల్లో సామాజిక అభ్యున్నతి కోసం అసామాన్య కృషిచేసి, విశిష్ట సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలకు అవార్డుల్లో రాష్ట్ర హైపవర్ స్క్రీనింగ్ కమిటీ పెద్దపీట వేసింది. వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డు కింద రూ.10 లక్షల నగదుతో పాటు వైఎస్సార్ కాంస్య విగ్రహం, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, వైఎస్సార్ సాఫల్య అవార్డుకు రూ.5 లక్షల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం బహూకరించనున్నారు.

# హైకోర్టులో అమరావతి పాదయాత్రకు చుక్కెదురు

అమరావతి: ఏపీ హైకోర్టులో అమరావతి పాదయాత్రకు చుక్కెదురైంది. గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించేది లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. షరుతులకు లోబడే పాదయాత్ర జరగాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అమరావతి పాదయాత్రకు సంబంధించి వేసిన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు కొట్టివేసింది. డీజీపీ ఇచ్చిన గుర్తింపు కార్డులు లేదా ఏ ఇతర గుర్తింపు కార్డునైనా పోలీసులకు చూపించాలని విచారణ సందర్భంగా హైకోర్టు పేర్కొంది. పాదయాత్రలో పాల్గొనకుండా మరే రకంగా అయినా సంఘీభావం తెలపవచ్చని తెలిపిన కోర్టు.. తమ ఆదేశాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉల్లంఘించవద్దని పేర్కొంది. ఒకవేళ పాదయాత్రలో షరతులను ఉల్లంఘిస్తే యాత్ర రద్దు కోసం రాష్ట్ర డీజీపీ తమను ఆశ్రయించవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది.



# అమరావతి విచారణ కేసులో ట్విస్ట్

## విచారణ నుంచి తప్పుకున్న సీజేఐ

న్యూఢిల్లీ నవంబర్ 1,ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాలన్న ఏపీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై విచారణలో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. మంగళవారం ఈ కేసుపై విచారణ జరుగుతుందని అంతా భావించారు. వాస్తవానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి యూయూ. లలిత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ముందు కేసు విచారణ జరగాల్సి ఉంది. అయితే ఈకేసు విచారణను వేరే బెంచ్ కు బదిలీ చేస్తూ భారత సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. కేసు విచారణ నుంచి వైదొలగుతున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యూయూ. లలిత్ నిర్ణయించారు. దీంతో వేరే బెంచ్ ముందు విచారణ చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా విచారాణకు అనుమతివ్వాలని జస్టిస్ లలిత్ కోరారు. దీంతో వేరే బెంచ్ ముందు ఈ కేసు విచారణ జరగనుంది. దీనికి కొద్ది రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాలని గతంలో హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేసిన ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యూయూ లలిత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ముందు విచారించాలని తొలుత నిర్ణయించారు. తాజాగా జస్టిస్ లలిత్ ఈ



కేసు విచారణ నుంచి తప్పుకోవడంతో వేరే ధర్మాసనం ముందు విచారణకు రానుంది. హైకోర్టు తీర్పుపై స్టే విధించాలని ఏపీ ప్రభుత్వం కోరుతుంది. వికేంద్రీకరణ తమ విధానమని, అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసమే మూలు రాజధానుల నిర్ణయం తీసుకున్నామని రాష్ట్రప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తోంది. కమిటీ నివేదికలను హైకోర్టు పట్టించుకోవడం లేదని ప్రభుత్వం వాదిస్తోంది. ఒకేచోట నిధుల కేంద్రీకరణతో ప్రాంతీయ అసమానతల పెరిగే అవకాశం ఉందని, విభజన చట్టం, రాజధానిపై రాష్ట్ర ప్రభుత్వానికే సర్వాధికారం ఉందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతూ వస్తోంది. విస్తృత ప్రయోజనాల దృష్ట్యా రాజధాని మార్పు అనివార్యమంటోంది. రాజధాని భూ సమీకరణలో అవకతవకలు జరిగాయని, అమరావతిలో రాజధాని నిర్మాణానికి రూ.1,09,000 కోట్లు అవసరం అని, రాజధాని వికేంద్రీకరణ ఖర్చు రూ.2000 కోట్ల రూపాయలు మాత్రమే అని ప్రభుత్వం చెబుతోంది. రైతులతో జరిగిన అభివృద్ధి ఒప్పందాల్లో ఉల్లంఘనలు జరగలేదుని అంటోంది. ప్రభుత్వ వాదనపై అమరావతి రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతినే కొనసా గించాలని రైతులు కోరుతున్నారు. ప్రాంతాల మధ్య వైసీపీ చిచ్చు పెడుతోందని ఆరోపిస్తున్నారు. విభేదాలు సృష్టించేందుకే మూడు రాజధానుల అంశాన్ని తీసుకొచ్చారని ఆరోపిస్తున్నారు అమరావతి రైతులు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతిపై కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదని, పాదయాత్రను అడ్డుకోవడం, దాడులు చేయడం మానుకోవాలని రైతులు అంటున్నారు. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని ఉండాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు. హైకోర్టు తీర్పుని వైసీపీ ప్రభుత్వం అమలు చేయడం లేదని, ప్రభుత్వ వైఖరిని ప్రజల్లో ఎండగడతామని రైతులు చెబుతున్నారు. ఏపీ ప్రభుత్వం, అమరావతి రైతులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సుప్రీకోర్టు ఈ కేసులో ఎటువంటి తీర్పు వెలువరిస్తుందనేది వేచి చూడాల్సి ఉంది.

# మరో రెండు రోజులు వానలే వానలు

విజయవా, నవంబర్ 1,ఏపీలోని పలుజిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు, ప్రకాశం, గుంటూరుజిల్లాలో పలుచోట్ల వర్షాలు దంచి కొడుతున్నాయి. నెల్లూరు జిల్లాలోని కావలి, గూడూరు, సూళ్లూరుపేటలో కుండపోత వర్షం పండుతున్?నయి. ఒంగోలులో భారీ వర్షం, అద్దంకిలో ఓమోస్తరు వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలదిగ్భందంలో చిక్కుకున్నాయి. నెల్లూరు జిల్లాలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. రాత్రి నుంచి పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి వర్షాలు. కావలి, వెంకటాపురం, కోవూరు, గూడూరు, ఆత్మకూరు, సూళ్లూరుపేట లో అత్యధికంగా వర్షాలు పడ్డాయి. దీంతో జనజీవనం స్థంభించిపోయింది. తుఫాన్ నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురియనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. నెల్లూరు జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధికారులను అప్రమత్తం చేశారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వానలు హడలెత్తిస్తున్నాయి. ఒంగోలులో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఒంగోలులో భారీ వర్షానికి నాళాలు పొంగిపొర్లుతున్నాయి. రేపల్లె, నిజాంపట్నం మండలాలు కుండపోత వర్షాలకు తడచిముద్దయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. బాపట్ల జిల్లాలోని చీరాల, పర్చూరు, చిన్నగంజాం, ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అద్దంకిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. అద్దంకిలో వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అటు గుంటూరులోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. గుంటూరులోని పలు ప్రాంతాలు వరుస వర్షాలకు వణికిపోతున్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉపరితల ఆవర్తనం కారణంగా రానున్న రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని తెలిపింది. నైరుతి బంగాళాఖాతం, ఉత్తర శ్రీలంక తీరంలో సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో విస్తరించి ఉంది.



# తాము అధికారంలోకి వచ్చాక యధావిధిగా ఎన్టీఆర్ యూనివర్సిటీ

## టీడీపీ అధినేత చంద్రబాబు

అమరావతి నవంబర్ 1విజయవాడలో ఉన్న ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును వైఎస్ జగన్ ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మార్చింది. ఇందుకు సంబంధించిన బిల్లుపై గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సంతకం కూడా చేశారు. దీంతో ఇన్నాళ్లూ డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్గా ఉన్న



వర్సిటీ పేరు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగామారింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో యూనివర్సిటీ పేరు మారుస్తామని ఏపీ ముఖ్యమంత్రి జగన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా తాము అధికారంలోకి వచ్చాక యధావిధిగా ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్గా కొనసాగిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఎన్టీఆర్ హయాం కంటే చంద్రబాబు హయాం కంటే తన తండ్రి తన హయాంలోనే ఎక్కువ ఆస్పత్రులు వైద్య కళాశాలలు నెలకొల్పామని.. అందువల్ల తన తండ్రి పేరే యూనివర్సిటీకి ఉండటం ధర్మమని జగన్ సమర్థించుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు శాసనసభ శాసనమండలిలో యూనివర్సిటీ పేరు మార్పు బిల్లును ప్రవేశపెట్టి జగన్ ప్రభుత్వం ఆమోదించుకున్న సంగతి తెలిసిందే. దీనికి తాజాగా గవర్నర్ సంతకం కూడా పెట్టడంతో అది చట్టరూపం దాల్చింది. దీంతో జగన్ ప్రభుత్వం యూనివర్సిటీ పేరును డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చినట్టు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంపై అన్ని పార్టీలు వివిధ సంఘాల్లో .. చివరకు వైఎస్సార్ కాంగ్రెస్లోనే పలువురు నేతల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయిన సంగతి తెలిసిందే. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేరు మార్పును నిరసిస్తూ తన అధికార భాషా సంఘం అధ్యక్ష పదవికి హిందీ అకాడమి చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. స్వయంగా సీఎం జగన్ సోదరి వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల సైతం జగన్ చర్యను తప్పుబట్టారు. కాగా తాము అధికారంలోకి వచ్చాక యధావిధిగా ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్గా కొనసాగిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు.

# హైదరాబాద్ చేరుకున్న జోడోయాత్ర

## శంషాబాద్ నుంచి ప్రారంభమైన రాహుల్ నడక

## విద్యార్థులతో కలసి ఉత్సాహంగా నడిచిన కాంగ్రెస్ నేత

హైదరాబాద్,నవంబర్1: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర తెలంగాణలో కొనసాగుతోంది. ప్రస్తుతం యాత్ర హైదరాబాద్‌కు చేరుకుంది. అందులో భాగంగానే శంషాబాద్ నుంచి కాలేజీ విద్యార్థులతో కలిసి రాహుల్ నడక చేపట్టారు. వారితో మాట్లాడుతూ పాదయాత్ర కొనసాగించారు. ఆయన మార్గం మధ్యలో ఒక విద్యార్థిని భరత నాట్యం చేస్తుందని తెలుసుకొని కాసేపు నాట్యం తిలకించి ముందుకు కదిలారు. శంషాబాద్ వద్ద ప్రారంభమైన భారత్ జోడో యాత్ర.. ఆరాంఘర్, బహదూర్ పురా, పురానాపూల్, హుస్సేనీ ఆలం, లాడ్ బజార్, చార్మినార్, మదీన, గాంధీభవన్ మీదుగా నెక్లెస్ రోడ్డుకి చేరుకోనుంది. రాహుల్ గాంధీ రాక కోసం ఆరాంఘర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలు భారీ ఏర్పాట్లు చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' మంగళవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ క్రమంలో అక్కడ బహిరంగ సభలో పాల్గొననున్న రాహుల్ గాంధీ.. చార్మినార్ వద్ద జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. క్రమంలో అక్కడ బహిరంగ సభలో పాల్గొననున్న రాహుల్ గాంధీ? చార్మినార్ వద్ద జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్న ఈ యాత్రలో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. అందరూ నడుస్తుండగా అకస్మాత్తుగా ఓ ఆవు యాత్రలోకి దూసుకొచ్చింది. దీంతో అప్రమత్తమైన నేతలు.. చెల్లాచెదురుగా అయ్యారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. భారత్ జోడో యాత్రను ఉత్సాహంగా సాగిస్తోన్న రాహుల్ గాంధీ.. టీఆర్ఎస్, బీజేపీపై కీలక వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ తో ఎట్టి పరిస్థితుల్లోనూ పొత్తు ఉండబోదన్న ఆయన.. వచ్చే ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని



ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒకేరకం పార్టీలని, వందల కోట్ల అవినీతి సొమ్మును ఎలక్షన్ల కోసం, నాయకుల కొనుగోళ్ల కోసం ఖర్చు చేస్తున్నాయని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న విద్వేషపూరిత, విచ్ఛిన్న రాజకీయాలను తిప్పికొట్టి, ప్రజల్లో సమైక్యతను తీసుకొచ్చేందుకే తాను యాత్ర చేస్తున్నానని తెలిపారు. యాత్రతో చాలా విషయాలు నేర్చుకుంటున్నానని, యాత్ర తప్పకుండా పార్టీ ఉన్నతికి తోడ్పడుతుందన్నారు.

# సంపాదకీయం

బుధవారం 02-11-2022

## ముందుంది... మండే కాలమే

వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న పెను మార్పులతో మానవాళి ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని, దీన్ని గురించి ప్రపంచదేశాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యల గురించి యూనిసెఫ్ , ప్రపంచ ఆరోగ్య సంస్థ చాలాకాలం నుంచి హెచ్చరిస్తూనే ఉన్నాయి. ఇప్పుడే ఐరోపాలో వడగాడ్పుల తీవ్రత అనూహ్యం గా పెరుగవచ్చని అంచనా వేయగా, ఆసియా , ఆఫ్రికాలోని పిల్లలు చాలా అధిక ఉష్ణోగ్రత లకు గురవు తారని నివేదిక హెచ్చరించింది.ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం, 2050 నాటికి, ప్రపంచవ్యాప్తంగా రెండు బిలియన్లకు పైగా పిల్లలు తరచుగా వేడి గాలులను ఎదుర్కొంటారు, ప్రపంచం తక్కువ స్థాయి గ్లోబల్ హీటింగ్‌ను సాధిస్తుందో లేదో అనే దానితో సంబంధం లేకుండా. 'ది కోడెస్ట్ ఇయర్ ఆఫ్ ది రెస్ట్ ఆఫ్ దెయిర్ లైఫ్స్' అనే నివేదిక ప్రకారం, రాబోయే మూడు దశాబ్దాల్లో దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ 1.7 డిగ్రీల వేడెక్కువయి పిల్లలకు ఎక్కువ కాలం, వేడిగా , తరచుగా వచ్చే వేడి తరం గాలను నిరోధించే అవకాశం లేదు. ప్రస్తుతం, దాదాపు 500 మిలియన్ల మంది పిల్లలు అధిక ఉష్ణ తరంగాల ఫ్రీక్వెన్సీకి గురవుతున్నారని, మరో 600 మిలియన్లకు పైగా తీవ్రమైన అధిక ఉష్ణోగ్రతలతో కూడిన ఇతర అధిక వేడి చర్యలకు గురవుతున్నారని నివేదిక హైలైట్ చేస్తుంది. పాదరసం పెరుగుతోంది పిల్లలపై ప్రభావం చూపుతుందని యూనిసెఫ్ చీఫ్ కేథరీన్ రస్సెల్ చెప్పారు. ఇప్పటికే, 3 మంది పిల్లలలో 1 మంది తీవ్రమైన అధిక ఉష్ణో గ్రతలను ఎదుర్కొనే దేశాల్లో నివసిస్తున్నారు దాదాపు 4 మంది పిల్లలలో ఒక్కరు అధిక వడగాడ్పులకు గురవుతున్నారు, ఇది మరింత తీవ్రమవు తుందని నివేదిక తెలియజేసింది.వడగాడ్పులు పెద్దలు, పిల్లలను వేరు వేరు విధాలుగా ప్రభావితం చేస్తాయి, ఎందుకంటే మరీ ముఖ్యం గా పిల్లలపై ప్రభావానికి ఎక్కువ అవకాశం ఉంది. పిల్లలు పెద్దవారిలా శరీర ఉష్ణోగ్రతను నియంత్రిం చలేరు. అందువల్ల దీర్ఘకాలిక శ్వాసకోశ పరిస్థితులు, ఉబ్బసం, హృదయ సంబంధ వ్యాధు లకు ఎక్కు వహానికి అవకాశం ఉంది. శిశువులు, చిన్నపిల్లలు వేడి-సంబంధిత మరణాల ప్రమాదాన్ని ఎక్కువగా ఎదుర్కొంటారు, ఇది వివరిస్తుంది. అన్ని ప్రభుత్వాలు గ్లోబల్ హీటింగ్‌ను తక్షణమే 1.5 డిగ్రీల సెల్సి యస్‌కు పరిమితం చేయడం కనీస చర్య అని నివేదిక మరింత సూచిస్తుంది.ఐరోపాలో వడగాడ్పుల తీవ్రత అనూహ్యంగా పెరుగుతుందని అంచనా వేయగా, ఆసియా, ఆఫ్రికాలోని పిల్లలు నివేదిక ప్రకారం చాలా అధిక ఉష్ణోగ్రతలకు గురవుతారు. భారత్, పాకిస్థాన్, సౌదీ అరేబియా, సూడాన్ వంటి దేశాలు రెండు విభాగాల్లోనూ దారుణమైన పరిణామాలను ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొంది.పంటలపై వేడిగాలుల ప్రభావం, సాధారణంగా పర్యావరణం అదనపు సవాలుగా మారడాన్ని నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. పిల్లల భవిష్యత్తు జీవనోపాధిని కొనసాగించడానికి వాతావరణ ఆర్థిక సహా యం, పెరుగుతున్న నిధులు, వాతావరణ మార్పు, విద్య, పటిష్టమైన ఆహార వ్యవస్థల వంటి చర్యలను ప్రతిపాదిస్తుందన్నది.

## 23లో జనసేనా కింగా...?




విశాఖపట్టణం, నవంబర్ 1, నున్న ఎన్నికల్లో వైసీపీ, తెలుగుదేశం మధ్య హోరాహోరీ పోరు తప్పదని రాష్ట్ర రాజకీయాలను చూస్తే స్పష్టమవుతోంది. ఇటువంటి తరుణంలో ప్రతి ఓటూ కీలకంగా మారుతున్నది. ఈ రెండు పార్టీల అధికారానికి వారధిగా జనసేన నిలబడింది. జనసేన ఎవరివైపు మొగ్గుచూపితే వారికి అధికారం ఖాయమనే అంచనాలు రాజకీయ వర్గాల్లో ఉన్నాయి. ఏ ఓటు అయినా జనసేన మీదగానే టీడీపీకికానీ, వైసీపీకికానీ వెళ్లాల్సి ఉంటుంది అనేది సుస్పష్టం.గతంలోలా రాజకీయంగా తప్పులు చేయకుండా ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వకుండా చూడాలనే యోచనలో ఉన్నారు. సినిమాల ద్వారా యువతలో మంచి ఫాలోయింగ్ ఉంది. అభిమానుల ఓట్లను కూడా జనసేనవైపు మళ్లించేలా పవన్ వ్యూహరచన చేస్తున్నారు. విశాఖపట్నాన్ని కార్యనిర్వాహక రాజధానిగా చేసి ఉత్తరాంధ్రలోనే పట్టు నిరూపించుకోవాలని వైఎస్ జగన్ ప్రయత్నిస్తుండగా, మరోవైపు తనకు ఎక్కువ అభిమానులు, పార్టీ శ్రేణులు ఉన్న ఈ మూడు ఉమ్మడి జిల్లాల్లో తన బలాన్ని చూపించాలని పవన్ కల్యాణ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇక టీడీపీకి మొదటి నుండి ఇక్కడ కంచుకోటలాగా నిలబడే పార్టీ శ్రేణులు ఉన్నాయి. ఆ బలాన్ని మరింత పటిష్ఠం చెయ్యడానికి చంద్రబాబు వ్యూహం పన్నుతున్నారు. ఇలా అందరికి కావాల్సింది ప్రస్తుతం ఉత్తరాంధ్రనే కావడం ఏపీ రాజకీయాల్లో నయా ట్రెండ్‌గా మారింది.శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల నుంచి మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నవారి నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో జనసేన చీల్చిన ఓట్లవల్లే నెగ్గి ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రులుగా అధికారం చెలాయిస్తున్నవారున్నారు. ఈ రెండు కలిసినా ఎక్కువ మెజారిటీ సాధించినవారు కూడా ఉన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీకి ఎన్ని ఓట్లు వచ్చాయి? టీడీపీకి ఎన్ని వచ్చాయి? జనసేనకు ఎన్ని వచ్చాయి? అనేది విశ్లేషిస్తే ఓట్ల చీలిక లో జనసేన ఎంతటి కీలక పాత్ర పోషించిందో అర్థం అవుతుంది. ఉత్తరాంధ్ర నుండి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మాన ప్రసాదరావుకు 84,084 ఓట్లు పోలవగా తెలుగుదేశం పార్టీకి 78,307, జనసేనకు 7557 ఓట్లు వచ్చాయి. 5,777 మెజారిటీతో గెలుపొందిన ధర్మాన మెజారిటీ జనసేనకు పోలైన ఓట్లకంటే తక్కువ.అనకాపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గుడివాడ అమర్ నాథ్ కు 73,207 ఓట్లు రాగా టీడీపీకి 65,038 ఓట్లు, జనసేనకు 12,988 ఓట్లు వచ్చాయి. ఈ రెండు పార్టీలు కలిసి పోటీచేస్తే అమర్నాథ్ కన్నా ఎక్కువ మెజారిటీ వస్తున్నది. భీమిలి నుంచి విజయం సాధించిన మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావుకు 100629 ఓట్లు రాగా, టీడీపీకి 91,917, జనసేనకు 24,248 ఓట్లు వచ్చాయి. అవంతి ఆధిక్యం 9,917గా ఉంది. బుడి ముత్యాలనాయుడికి మాత్రం ఈ రెండుపార్టీలకన్నా ఎక్కువ మెజారిటీ వచ్చింది. 78,830, 62,438, 3745 వచ్చాయి. చీపురుపల్లిలో బొత్స సత్యనారాయణకు 89,262 ఓట్లు రాగా, టీడీపీకి, 62,764, జనసేనకు 3659, కాంగ్రెస్ కు 4562, నోటాకు 3353 ఓట్లు పోలయ్యాయి.ఈ మూడు వర్గాలకు చెందిన ఓట్లు కలిపినా ఎక్కువ మెజారిటీయే బొత్సకు వచ్చింది. పలాసలో సీదిరి అప్పలరాజుకు 76,603, టీడీపీకి 60,356, జనసేనకు 6133 ఓట్లు వచ్చాయి.ఈ మూడేళ్ళ లో పెరిగిన ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు..అందరూ భావిస్తున్నట్టు టీడీపీ-జనసేన సహా ఇతర పార్టీలు కలిసి కట్టుగా ఎన్నికలకు వెళితే..ఈ మొత్తం సమీకరణాలు మారిపోనున్నాయి. ఉత్తరాంధ్ర లోని అధికార పార్టీకి చెందిన కీలక మంత్రులకు ..నేతలకుఈ టెన్షన్ ఎక్కువైంది.దీనితో అన్ని రాజకీయ పార్టీల లోనూ 2024 లో ఉత్తరాంధ్ర రిజల్ట్ ఏంటి అనే దాని పైనే దృష్టి కేంద్రీకృతమై ఉంది.

## జగనన్నకు చెబుదాం...

విజయవాడ, నవంబర్ 1,ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. 'జగనన్నకు చెబుదాం' అనే పేరుతో మరో కొత్త కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో విధి విధానాలపై సీఎం జగన్ ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. వినతుల పరిష్కారంలో మరింత మెరుగైన వ్యవస్థను తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ మేరకు స్పందనకు మెరుగైన రూపం పై అధికారులతో సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.వినతులకు సంబంధించి సీఎంఓ, ఉన్నతస్థాయి అధికారులతో పర్యవేక్షించేలా ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాసమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం అని చెప్పుకొచ్చారు. వ్యక్తులకు సంబంధించిన సమస్యలతో పాటు, కమ్యూనిటీకి సంబంధించిన సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాం. ఒక నిర్ణీత సమయం పెట్టుకుని వాటిని శరవేగంగా పరిష్కరించి ప్రజలకు అండగా నిలిచాం. ప్రస్తుతం ఈ కార్యక్రమం కొనసాగుతోంది. స్పందన తో పాటు.. ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై కూడా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా దృష్టి పెట్టాం. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వాటిని పరిష్కరించేందుకు నిధులు కూడా కేటాయించాం. ఇంకా ఏమైనా సమస్యలు మిగిలిపోయి ఉన్నాయా..? అన్న దానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. స్పందన కార్యక్రమాన్ని మెరుపరిచేలా ఆలోచన చేయాలి అని సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు.సమస్యల పరిష్కారంలో అంకితభావానికి నిదర్శనంగా మనం నిలవాలి. ప్రజల సమస్యలను తీర్చాలన్నదే మన ఉద్దేశం. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత నిజాయితీగా, అంకిత భావంతో, కృతనిశ్చయంతో మనం ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేశాం. మనం అంతా కలిసికట్టుగా గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. సమస్యల పరిష్కారం కోసం ఇప్పుడు చేస్తున్న కార్యక్రమాల్లో వృత్తి నైపుణ్యం పెంచడం, నిర్మాణాత్మక రీతిలో వ్యవహరించడం అన్నదానిపై మనం దృష్టి సారించాల్సి ఉంది. వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను కూడా పరిశీలించి అందులో ఎక్కడైనా స్వీకరించ దగ్గవి ఉంటే వాటిని కూడా స్వీకరించాలి అని సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు.పథకాలు కావొచ్చు, రెవెన్యూ రికార్డులకు సంబంధించిన అంశాలు కావొచ్చు..

ఇలా ఏదైనా కావొచ్చు. కానీ ఏ ఒక్కరూ కూడా అర్హులైన వారు మిగిలి పోకూడదు, అలాగే సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా మిగిలిపోవద్దు అన్నదే దీని ఉద్దేశం అని సీఎం జగన్ వ్యాఖ్యానించారు. ఈ విధానం ఎలా ఉండాలి? ఎలాంటి సమస్యలకు ఎలాంటి పరిష్కారాలు చూపాలి..? అన్నదానిపై ఒక మార్గదర్శక ప్రణాళిక రూపొందించాలి అని సూచించారు. సీఎంఓ, ఇతర ఉన్నతాధికారులతో కూడిన అధికార యంత్రాంగం వ్యవస్థకు ప్రజలు చేర్చిన ఫిర్యాదులు, వినతులకు పరిష్కారాలు చూపడమే ఉద్దేశంగా ఈ ఆలోచన చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. స్పందన కార్యక్రమం కన్నా మరింత మెరుగ్గా, సమర్థవంతంగా దీన్ని నిర్వహించాలన్నది ఉద్దేశం అని చెప్పుకొచ్చారు. అధికారులంతా కూర్చొని కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. ఇప్పటి వరకూ అమలవుతున్న స్పందన కార్యక్రమాన్ని మైక్రో స్థాయిలో కూడా పరిశీలన చేసి.. వాటిని మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలి. వినతుల పరిష్కారంలో ప్రజల సంతృప్తికి పెద్దపీట వేయాలి అని సీఎం వైఎస్ జగన్ ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

## టీడీపీ షాక్.. లవర్స్ రాక్...

తిరుపతి, నవంబరు 1, తమ బిడ్డను ప్రేమ పేరుతో తీసుకెళ్లి హత్య చేశారని న్యాయం జరిగేలా పోరాటం చేయాలని ఓ యువతి తల్లిదండ్రులు టీడీపీ నేతల వద్దకు వచ్చి వేడుకున్నారు. ఇలాంటి సమస్యలపై పోరాటం కోసమే తామున్నామని టీడీపీ నేతలు.. వారితో కలిసి జనసేన నేతలు రోడ్డెక్కారు. కానీ వారు అనుకున్నది ఒకటి.. అయితే జరిగింది మరొకటి. దీంతో టీడీపీ, జనసేన నేతలు షాక్‌కు గురి కావాల్సి వచ్చింది. అధికార పార్టీ నేతల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. శ్రీకాళహస్తి పట్టణంలోని మంచినీళ్ళ గుంటకు చెందిన చంద్రితా అనే యువతి తొమ్మిది నెలల క్రితం శ్రీకాళహస్తి పట్టణంకు సమీపంలోని రామాపురంకు చేందిన చంద్రశేఖర్ ను ప్రేమించి పెళ్ళి చేసుకుంది.. ఇరువురిది కులంతర వివాహం కావడంతో తమ ప్రేమ పెళ్ళి అడ్డుపడతారని ఊహించిన ప్రేమజంట అజ్ఞాతంలోకి వెళ్ళి పోయింది.. అయితే చంద్రిత తల్లిదండ్రులు తమ కుమార్తే కనిపించడం లేదంటూ అప్పట్లో నెల్లూరు జిల్లాలోని దొరవారిసత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.. అయితే మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు యువతి కోసం పలు ప్రాంతాలు గాలించారు.. యువతికి సన్నిహితంగా ఉన్న వారిని విచారించారు.. ఎవరికి ఎటువంటి సమాచారం లేక పోవడంతో పోలీసులు తమ స్టైల్ లో దర్యాప్తు సాగించారు.చివరికి ఈ నెల 20వ తేదీ గుర్తు తెలియని యువతీ మృతదేహం కేవీబి పురం పరిధిలో బయటపడింది. అది తమ బిడ్డ చంద్రితాది అని రామాపురంకు చెందిన వాలంటీర్ చంద్రశేఖర్ తమ కుమార్తెను చంపేశాడని తమకు న్యాయం చేయాలంటూ చంద్రిత తల్లిదండ్రులు టిడిపి నాయకులను ఆశ్రయించారు.. ఇదే విషయం తెలుసుకున్న జనసేన నాయకులు టిడిపి నాయకులతో కలిసి ధర్నాలు, నిరసనలతో శ్రీకాళహస్తి పట్టణం వారం రోజులుగా దద్ధరిల్లి పోయింది.. స్థానిక వైసీపి ఎమ్మెల్యేపై టిడిపి, జనసేన నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కానీ ఇక్కడే అసలు ట్విస్ట్ వెలుగు చూసింది. తాను చనిపోయానని.. తనను తన భర్త చంద్రశేఖర్ చంపేశారని శీకాళహస్తిలో రాజకీయ ఆందోళనలు జరుగుతూండటంతో చంద్రశేఖర్, చంద్రితలు తాము క్షేమంగా ఉన్నామని సెల్ఫీ వీడియో పంపారు. మేము క్షేమంగా ఉన్నాం, మాకోసం ఎవరూ గాలించకండి, మా పై అనవసరంగా నిందకు వేసి రాజకీయం చేయకండి అంటూ చెప్తూ, తమ క్షేమ సమాచారంను తల్లిదండ్రులకు చేరవేశారు. దీంతో టీడీపీ, జనసేన నేతలు తమ పోరాటం అంతా వృధా పోయిందని నిట్టూర్చారు. చంద్రితా తల్లిదండ్రులకూ ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు. అయితే ఈ ఆందోళనల వారికీ క్షేమ సమాచారం తెలిసిందని వారూ నిట్టూర్చారు. న్యాయం జరిగే వరకూ తగ్గేదేలే అంటూ యువతి తల్లిదండ్రులు కూడా ధర్నాలు చేశారు. పోలీసులు గుర్తు తెలియని మృతదేహం చంద్రితది నిర్ధారణ కాలేదని పోస్టుమార్టం నివేదిక వచ్చే వరకూవేచి చూడాలని నచ్చజెప్పినా టిడిపి,జనసేన నాయకులు వినలేదు. యువతి తల్లిదండ్రులు.. అది తమ అమ్మాయి మృతదేహమేనని గట్టిగా చెప్పడంతో టీడీపీ, జనసేన నేతలు వారికి అండగా నిలబడి పోరాటం చేశారు. అయితే ఆ మృతదేహం ఎవరిది అన్నదానిపై ఇప్పటి వరకూ క్లారిటీ లేదు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆధారాలు లేకుండా చంద్రితా భర్త చంద్రశేఖర్‌పై నిందలు వేశారని.. టీడీపీ, జనసేన నేతలపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు కాళహస్తిలో ప్రదర్శనలు నిర్వహించారు. టీడీపీ ఇంచార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డిపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

## పీకే కామెంట్స్‌పై చర్చోపచర్చలు

విజయవాడ, నవంబర్ 1,ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బీహార్‌లో పాదయాత్ర చేస్తూ జగన్మోహన్ రెడ్డి, నితీష్ కుమార్‌ల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ప్రత్యేకంగా ఇద్దరి పేర్లు చెప్పి వారి కోసం పని చేసి సమయం వృథా చేసుకున్నానని ఓపెన్‌గా చెప్పడంతో .. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా ఏపీలో చర్చనీయాంశం అవుతోంది. బీహార్‌లో రాజకీయ పార్టీ పెట్టాలనుకుంటున్న ప్రశాంత్ కిషోర్ ముందుగా పాదాయత్ర చేస్తున్న నేపాల్.. సరిహద్దుల్లో ప్రస్తుతం పాదయాత్ర సాగుతోంది. అక్కడ ఆయన మాట్లాడిన మాటల వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గాడ్సే వాదానికి గాంధీలను బలపరచడమే కరెక్ట్ అని .. తన ప్రొఫెషనల్ జీవితంలో పదేళ్ల పాటు నితీష్ కుమార్, జగన్మోహన్ రెడ్డిలకు పని చేయకుండా కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు పని చేసి ఉండాల్సిందన్నారు. ఆయన వ్యాఖ్యల వెనుక పరమార్థం ఏమిటో కానీ.. ఏపీలో మాత్రం జగన్ ను గెలిరపించినందుకు ప్రశాంత్ కిషోర్ పశ్చాత్తాపం చెందుతున్నారని ప్రచారం చేసుకుంటున్నారు. కానీ ఆయన కాంగ్రెస్ పార్టీ మరింత మెరుగైన స్థితిలో ఉండేందుకు తాను ఆ పదేళ్లు కేటాయించి ఉన్నట్లయితే బాగుండేదన్న ఉద్దేశంలో మాట్లాడారు కానీ.. నితీష్ కుమార్, జగన్మోహన్ రెడ్డిలను కించపర్చడానికి కాదన్న వాదన వినిపిస్తోంది. రెండు రోజుల కింద పాదయాత్రకు డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయన్న విమర్శలకు ప్రశాంత్ కిషోర్ కౌంటర్ ఇచ్చారు. తాను స్ట్రాటజిస్ట్‌గా పని చేసిన పార్టీల్లో ఆరుగురు ఇప్పుడు ముఖ్యమంత్రులుగా ఉన్నారని వారు సాయం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తన పాదయాత్రకు సాయం చేస్తున్నారని చెప్పిన ఆయన.. వారికి పని చేయకుండా ఉండే బాగుండేదన్న ఉద్దేశంలో మాట్లాడటం హాట్ టాపిక్ అవుతోంది. అదీ కూడా ఇద్దరి పేర్లను మాత్రమే ప్రస్తావించారు. ఆ ఇద్దరిలో ఒకరు నితీష్ కుమార్.. జగన్మోహన్ రెడ్డి, నితీష్ కుమార్ కు ఇప్పుడు ఆయన పూర్తి వ్యతిరేకి. ఒకప్పుడు నితీష్ పార్టీకి చెందిన జేడీయూలో చేరి నెంబర్ 2గా ఎదిగారు. నితీష్ రాజకీయ వారసుడిగా ప్రచారం పొందారు. తర్వాత ఏం జరిగిందో కానీ బయటకు వచ్చేశారు. ఇప్పుడు ఆయనపై విమర్శలు గుప్పిస్తున్నారు.నితీష్‌ను తాను గెలిపించకుండా ఉండాల్సిందన్న ఉద్దేశంతోనే ప్రశాంత్ కిషోర్ మాట్లాడారని.. ఆ పేరుతో పాటు జగన్ పేరును యాడ్ చేయడంతోనే రాజకీయంగా .. జగన్‌కు వ్యతిరేకంగా కామెంట్లు చేసినట్లుగా గట్టి ప్రచారం జరుగుతోంది. నిజానికి పీకే టీఎం ఇప్పుడు కూడా జగన్ కోసం పని చేస్తోంది. ఐ ప్యాక్ నుంచి అధికారికంగా పీకే బయటకు వచ్చారు. ఆయన స్నేహితులు నడుపుతున్నారు. రిషిరాజ్ అనే పీకే సన్నిహితుడు ప్రస్తుతం వైఎస్ఆర్‌సీపీ రాజకీయ వ్యవహారాలను చూస్తున్నారు. అందుకే జగన్ గురించి వ్యతిరేక కామెంట్లు చేయరని.. కేవలం కాంగ్రెస్ పరిస్థితి మరింత మెరుగ్గా ఉండాలన్న ఆలోచనతోనే అలా చెప్పి ఉంటారని భావిస్తున్నారు. పీకే ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నించారు. కానీ ఆయనకు సానుకూలత లభించలేదు. దాంతో కాంగ్రెస్‌కు వ్యతిరేక కామెంట్లు చేశారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌కు అనుకూల కామెంట్లు చేస్తున్నారు.

## పిఠాపురంలో పేట్రేగుతున్న దొంగలు

### ఫిర్యాదు చేసి 15 రోజులు గడిచినా ఎఫ్ఐఆర్ కూడా వెయ్యని పోలీసులు

పిఠాపురం పిఠాపురం పట్టణం దొంగలకు అడ్డగా మారింది. పోలీసుల వ్యవహార శైలి కూడా దొంగలకు మరింత అనుకూలంగా మారి మరిన్ని దొంగతనాలకు పాల్పడడానికి అవకాశం గా ఉంటుంది. జిల్లాలోని ఇతర ప్రాంతాలు ఇతర జిల్లాల నుండి కూడా దొంగలు పిఠాపురం పట్టణంలో దొంగతనాలు చేయడానికి వస్తున్నారంటేనే పిఠాపురం పట్టణం దొంగలకు ఎంత అనుకూలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల కాలంలో వేరే ప్రాంతానికి చెందిన దొంగలు పిఠాపురం పట్టణంలో పట్టపగలు మహిళా మెడలోని బంగారు వస్తువులను లాకెళ్లిన సంగతి తెలిసిందే. అదేవిధంగా గత నెల 18వ తేదీన ఇద్దరు మహిళలు ఆటోలో పిఠాపురం పట్టణంలోనే 77 సంవత్సరాల ఒక వృద్ధుని వద్ద సుమారు 45 వేల రూపాయలు దొంగతనానికి పాల్పడగా వెంటనే సదరు వృద్ధుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన పదేపదే పోలీస్ స్టేషన్ చుట్టూ సర్కిల్ ఆఫీస్ చుట్టూ తిరిగినా కూడా ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయని పోలీసుల వ్యవహార శైలి చూస్తేనే అర్థమవుతుంది. సోమవారం జిల్లా పోలీస్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేస్తే ఎస్పీ గారు వెయ్యమని సూచిస్తే సదరు రిటైర్డ్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు కాపీయే పోలీస్ స్టేషన్లో లేకపోవడం మరింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. దీనిని బట్టి పోలీసులు పరోక్షంగా దొంగలకు సహకరిస్తున్నారని అర్థమవుతుంది. దొంగతనాలపై ఫిర్యాదు వచ్చిన వెంటనే ఎఫ్ ఐ ఆర్ వేసి ఇన్వెస్టిగేషన్ చేసినట్లయితే దొంగలు దొరకడానికి అవకాశం ఉంటుంది. దొంగతనం జరిగి ఫిర్యాదు చేసి 15 రోజులు గడుస్తున్నా కూడా పోలీసులు కనీసం ఎఫ్ఐఆర్ కూడా వేయకుండా విచారణ చేయకుండా తాత్సారం చేస్తున్నారు.

## కన్నుల పండువగా పుష్పయాగం

తిరుమల, నవంబర్ 1,తిరుమల శ్రీవారి ఆలయంలో పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసం శ్రవణ నక్షత్రంలో చేసే అపురూప యాగం పుష్ప యాగం. ఈ యాగానికి అంకురార్పణ శ్రవణ నక్షత్రం ఉన్న ముందు రోజు జరుగుతుంది. కంకణ ధారులైన ఆచార్యులు శ్రీవారి ఆలయంలో మూలవిరాట్ ఎదురుగా ఆచార్య ఋత్విక్‌వరణం చేశారు. పాలు, పెరుగు , తేనె , నెయ్యి , నారికేళ జలం , పసుపు , చందనం , కుంకుమ పువ్వు, వట్టి వేర్లు కలసిన సుగంధ పరిమళ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి పుష్ప యాగం నిర్వహించారు.మలయప్ప స్వామికి పుష్పాలు, పాత్రలతో అర్చన చేశారు. ముందుగా ఆ పుష్ప యాగం కోసం వివిధ రాష్ట్రాల నుండి దాదాపు 27 రకాలను సేకరించారు. ఈ పుష్పాలతో వేద పురాణ ప్రబంధ పారాయణం జరుపుతూ.. తులసీదళముల తో వివిధ రకాల పుష్పాలను స్వామివారి పాదాలకు సమర్పించారు. ఈ పుష్ప యాగం నిర్వహించడం వలన బ్రహ్మోత్సవంలో తెలిసీ తెలియక ఏమైనా దోషాలు జరిగితే.. ఆ దోషాల నుంచి ఉపశమనం లభిస్తుందని నమ్మకం. అంతేకాదు పుష్పయాగాన్ని దర్శించిన వారికీ ఉత్తమ గతులు లభిస్తాయని విశ్వాసం.పుష్పయాగానికి ఉపయోగించే పువ్వుల రకాలు: సంపంగి, కనకాంబరం, లిల్లీ, తామరపువ్వులు, విరజాజి, మరువం, దవనం, మల్లి, జాజి, రక రకాల గులాబీలు, చామంతి, కదిరిపచ్చ, బిల్వ, కనకాంబరం, కమలం, మొగలి వంటి అగ్రకర్ణికా, కాలనందా అనేవి మొత్తం ఇరవై ఏడు రకాలు పువ్వులతో వెంకటేశ్వరస్వామికి పుష్పకైంకర్యం చేశారు. ఈ పుష్పయాగం కోసం తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకకు చెందిన దాతలు పుష్పాలను పంపించారు. ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ఉత్సవర్లను సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణమండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. పుష్పయాగం నేపథ్యంలో అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం ఆర్జితసేవలను టిటిడి రద్దు చేసింది.ఉదయం శ్రీవారి ఆలయంలో మూలవిరాట్ ఎదురుగా ఆచార్య ఋత్విక్‌వరణం నిర్వహించారు. అర్చకులకు విధుల కేటాయింపునే ఋత్విక్‌వరణం అంటారు. ఇందులో వైదిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు.

# అనంతలో పీఏలే కింగ్ లు





అనంతపురం, నవంబర్ 1, హిందూపురం నియోజకవర్గంలో పీఏల హవా రాజ్యమేలుతోంది. ఈ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల పీఏలు "చెప్పిందే వేదం.. చేసిందే శాసనం" అన్నట్లుగా నడుస్తోంది. వీరి హవా ఎంతలా ఉందంటే పార్టీలు కష్టనష్టాల్లో ఉన్నప్పుడు వెన్నంటి నడిచిన పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తల మాటలు, సలహాలు, సూచనలు ఇక్కడ ఏమాత్రం పని చేయవు. వీరు ఏమి చెప్పినా నియోజకవర్గ అధిష్టానానికి చెవికి ఎక్కవు. అటు పార్టీలోనూ ఇటు అధికారులలోనూ పీఏ ఏమి చెబితే అదే చెల్లుబాటు అవుతుంది. వీరు ఎంతలా తయారయ్యారంటే పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కష్టపడ్డ నాయకులు, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు కిక్కురు మనకుండా ఉండాల్సిన పరిస్థితి దాపురించేలా చేస్తున్నారు. తాజాగా హిందూపురంలో ఉన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పీఏ గోపికృష్ణ నిర్వాకమే ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏ.. ఇప్పుడు అధికారంలో ఉన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పీఏ.. ఏది చెబితే అది నియోజకవర్గంలో జరగడం గమనార్హం. నియోజకవర్గంలో ఉన్న అధిష్టానానికి వీరు ఏమీ చెబితే అదే వేద వాక్కుఅయింది. పార్టీకి చెందిన నాయకులు గానీ, కార్యకర్తలు కానీ, అధికారులు కానీ ఏమి చెప్పినా నియోజకవర్గ అధిష్టానం మాత్రం వీరివైపు చూస్తుంది. నియోజకవర్గ అధిష్టానానికి కావాల్సిన 'సమస్తమూ' వీరు అమర్చి వారిని తమ చెప్పు చేతల్లో పెట్టుకుని రాజ్యాన్ని నడిపిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రతిదీ వీరు చెప్పినట్లే జరిగేలా చూసుకుంటూ పార్టీ పరువును గంగలో కలిపేస్తున్నారు. హిందూపురం నియోజకవర్గంలో శనివారం అఖిలపక్ష పార్టీల నాయకులు అందరూ సమావేశమై ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌ను నియోజకవర్గంలోని రాకుండా చూస్తామనే స్థాయికి వెళ్లారంటే ఆయన పీఏ గోపికృష్ణ నిర్వాకం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

హిందూపురం నియోజకవర్గంలో పీఏల మాటే చెల్లుబాటు అవుతోంది. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న 2014లో హిందూపురం నియోజకవర్గ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏ శేఖర్ సాగించిన హవా అంతా ఇంతా కాదు. పార్టీ నాయకులను, కార్యకర్తలను అందరినీ పక్కన పెట్టి ఆయన ఏమి చెబితే అదే శాసనంగా చెల్లుబాటు అయింది. తాజాగా ఎమ్మెల్సీ పీఏ గోపికృష్ణ సాగించిన వ్యవహారం కూడా ఆయనకు ఏమాత్రం తీసిపోవడం లేదు. ఆయన కన్నా ఒక ఆకు ఎక్కువగా హత్యా రాజకీయాలకు తెర లేపడం గమనార్హం. ఒక అనామక వ్యక్తిగా ఉన్న ఆయన ఎమ్మెల్సీ పంచన చేరిన తరువాత నియోజకవర్గంలో పార్టీని, అధికారులను తన చెప్పు చేతుల్లో పెట్టుకుని తాను ఏమి చెబితే అదే చెల్లుబాటు అయ్యేలా చేసుకున్నాడన్న ప్రచారం ఉంది. అక్కడ ఎమ్మెల్సీని ఒక డమ్మీగా మార్చివేసి సర్వం తానే అన్నట్లుగా కథ నడిపించి చివరకు కటకటాల పాలవడం గమనార్హం. చిన్నచిన్న పంచాయితీలు మొదలు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, దందాలు... చివరకు అధికారుల పోస్టింగులలో సైతం ఇతని మాటే చెల్లబాటు అయిందన్న ప్రచారం ఉంది. ఇతని మాటలను, సలహాలను గుడ్డిగా నమ్మిన ఎమ్మెల్సీ ప్రస్తుతం నియోజకవర్గంలోకి రావడానికి సైతం వెనుకాడుతూ ఉన్నాడన్న ప్రచారం జరుగుతోంది. 2014లో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పీఏగా పనిచేసిన శేఖర్ చేసిన నిర్వాకాన్ని ఇప్పటికీ నియోజకవర్గంలో కథలు, కథలుగా చెప్పుకుంటూ ఉంటారు. అప్పట్లో ఆయన మాటే వేద వాక్కుగా చలామణి అయింది. దీంతో తనకు ఎదురులేదని భావించిన అతను పార్టీ ముఖ్య నాయకులను, కార్యకర్తలను పక్కన పెట్టి పెద్ద ఎత్తున దందా నడిపించారు. ప్రతి పనికి డబ్బులు దండుకున్నారు. ఎవరైనా డబ్బులు ఎందుకు ఇవ్వాలని అడిగితే బాలకృష్ణకు, ఆయన భార్యకు కూడా వాటాలు ఇవ్వాల్సి ఉంటుందని బహిరంగంగానే చెప్పేవాడు. ప్రతి పనికి, బదిలీకి ఇంత రేటు అని ఫిక్స్ చేసి మరీ దోచుకున్నాడన్న అపప్రథ మూట కట్టుకున్నారు. ఆఖరికి పార్టీ నాయకులైనా, కార్యకర్తలైనా లంచం ఇస్తేనే పనులు, బదిలీలు కావాలన్నా డబ్బులు ఇచ్చుకోవలసిందే. దీంతో అప్పట్లో ఆయనపై పార్టీలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. తాజాగా ఎమ్మెల్సీ పీఏ వ్యవహారం కూడా ఆయనకు ఏమాత్రం తీసిపోకుండా జరుగుతోందని పార్టీలోనూ, ప్రజల్లోనూ ప్రచారం జరుగుతోంది. ఆయన ఏమి చెబితే అదే ఎమ్మెల్సీ వింటారన్న ప్రచారం సైతం జోరుగా సాగింది. ఆఖరుకు పలుమార్లు నియోజకవర్గంలోని నాయకులు అందరూ ఏకమై ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లినప్పటికీ ఏమాత్రం ఫలితం లేకుండా పోయింది. దీంతో నాయకులందరూ ఏమి మాట్లాడకుండా కిక్కురుమనకుండా ఉండిపోయారు. చివరకు హత్యా రాజకీయాలకు సైతం తెరలేపిన ఎమ్మెల్సీ పీఏ ప్రస్తుతానికి జైలులో ఊచలు లెక్కబెడుతూ ఉన్నారు. ఇలా నాడు ఎమ్మెల్యే.. నేడు ఎమ్మెల్సీ పీఏల మాటలు, సలహాలను పాటించి నెత్తి మీదకు తెచ్చుకున్నారు. వీరి మాటలను నమ్మిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పార్టీ కోసం కష్టపడిన నాయకులను, కార్యకర్తలను పూర్తిగా పక్కన పెట్టి వేశారన్న ప్రచారం ఉంది. పాటు పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో శ్రమించిన వీరిపైనే కేసులు పెట్టి వేధించారన్న ప్రచారం కూడా వీరిపై ఉంది. వీటన్నింటితో పాటు వీరి మాటలను నమ్మి పీఏల చెప్పు చేతల్లో కీలుబొమ్మలుగా మారిపోయి పార్టీ పరువును గంగలో కలిపి వేశారన్న ప్రచారం సాగింది. దీంతో నాడు తెలుగుదేశం హయాంలోనూ నేడు అధికార పార్టీలోనూ నాయకులు, కార్యకర్తలు అందరూ ఏకమై పీఏల అవినీతి, అక్రమాలు, అధికార దాహాల గురించి పలు వేదిక లపై బహిరంగంగానే మాట్లాడుతూ ఉండడం గమనార్హం. వీరి వ్యవహార శైలి వల్ల పార్టీ పరువు మంట కలిసిపోతూ ప్రజల్లో పార్టీ పట్ల చులకన భావం ఏర్పడినప్పటికీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లలో కనీసం చలనం కూడా లేకుండా ఉందన్న ప్రచారం ఆయా పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

## టార్గెట్ పవన్....

విజయవాడ, నవంబర్ 1,వైసీపీ అధినేత జగన్ ఏదీ అంత ఆషామాషీగా నిర్ణయం తీసుకోరు. భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకునే ఆయన నిర్ణయం ఉంటుంది. ఆయన నేరుగా విమర్శలు చేశారంటే అందుకు ఒక అర్థముందని చెబుతున్నారు. ప్రధానంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను టార్గెట్ చేయడం వెనక కూడా ఒక వ్యూహం దాగి ఉందని చెబుతున్నారు. టీడీపీ, జనసేన కలిస్తే తమకే మంచిదన్న ఆలోచనలో జగన్ ఉన్నారట. అందువల్ల రాజకీయ ప్రయోజనాలతో పాటు మరికొన్ని అడ్వాంటేజీలు తమకు వస్తాయని జగన్ భావిస్తున్నారని పార్టీ వర్గాలు



చెబుతున్నాయి. అందుకే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను వరసగా టార్గెట్ చేస్తున్నారు. వైసీపీ నేతలు మాటలతో రెచ్చగొడుతున్నారు. విశాఖ వంటి సంఘటనలు కూడా తమకు కలసి వస్తాయని భావిస్తున్నారు. టీడీపీతో పవన్ కలిసినా బీజేపీ ఎట్టి పరిస్థి?తుల్లో కలవదు. అది ఒంటరిగానైనా పోటీ చేస్తుంది తప్ప తెలుగుదేశం పార్టీతో కలవదు. చంద్రబాబు ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ తోనైనా కలిసే అవకాశముంది తప్పించి జగన్ ఎట్టిపరిస్థితుల్లో కాంగ్రెస్ తో చేయి కలపరు. అది తెలిసిన బీజేపీ జగన్ కే మద్దతుగా ఉంటుందన్న అంచనా వేస్తున్నారు. బీజేపీతో నేరుగా పొత్తు పెట్టుకోకపోయినా పరోక్షంగా కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉంది కాబట్టి కొన్ని ప్రయోజనాలను ఎన్నికల సమయంలో పొందే వీలుంది. ఇక కాపుల్లోనూ పవన్ కల్యాణ్ కు అంత సానుకూలత లేదు. గంపగుత్తగా ఆ సామాజికవర్గం ఓట్లన్నీ పవన్ కు పడవు. టీడీపీతో కలిస్తే మెజారిటీ కాపు ఓటర్లు తమ వైపు చూసే అవకాశం ఉందన్న అంచనాలో జగన్ ఉన్నట్లు చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేసేందుకు మద్దతిచ్చినంత మాత్రాన కాపులు పవన్ వెంట నడవరన్నది ఆయన ఆలోచన. అందుకే పవన్ ఎంత త్వరగా చంద్రబాబుతో కలసి రాష్ట్రమంతటా పర్యటిస్తే అంత మంచిదని జగన్ భావిస్తున్నారు. కాపుల్లో ఎక్కువ శాతం తనవైపు చూసే అవకాశం ఉందన్నది ఆయన ఆలోచన. ఆ రెండు సామాజికవర్గాలకు ఆంధ్రప్రదేశ్ లో బద్ధ విరోధం ఉంది కాబట్టి తనకు అడ్వాంటేజీగా మారుతుందని జగన్ ఆశిస్తున్నారు. మరో కీలకమైన అంశం. బీసీ ఓటర్లు. ఏపీలో అత్యధికంగా బీసీ ఓటర్లున్నారు. పవన్ కల్యాణ్ టీడీపీకి మద్దతు ప్రకటిస్తే బీసీలు ఆటోమేటిక్ గా తమకు అనుకూలంగా మారతారని జగన్ అంచనా వేస్తున్నారు. కాపులకు వ్యతిరేకంగా బీసీలు పనిచేస్తారని పసిగట్టిన జగన్ తొలి నుంచి వారిని మంచి చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల్లోనే బీసీలు కొంత వైసీపీ వైపు మొగ్గు చూపారు. ఈసారి చంద్రబాబు, పవన్ కలిస్తే 80 శాతానికి పైగానే బీసీ ఓటర్లు వైసీపీకి టర్న్ అయ్యే అవకాశాలున్నాయంటున్నారు. అందుకే పవన్ చంద్రబాబు కలవాలని జగన్ బలంగా కోరుకుంటున్నారు. ఇటు బీసీలు, అటు కాపుల్లో కొంత శాతం తనకు అనుకూలంగా మారితే మరోసారి విజయం తనదేనన్న విశ్వాసంతో జగన్ ఉన్నారు. అందుకే పవన్ ను రెచ్చగొట్టి త్వరగా టీడీపీతో కలిసేలా వైసీపీ అధినేత పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది

## కాణిపాకం టూ తిరుమల..దళారీల దందా

తిరుపతి, నవంబర్ 1, తిరుమల పుణ్యక్షేత్రంలో దళారులు చాప కింద నీరులా భక్తులను మోసగిస్తున్నారు. దర్శనం కోసం చూసే భక్తులను టార్గెట్ గా చేసుకుని నిలువునా దోచేస్తున్నారు. దర్శన టోకెన్లు లేని భక్తులను గుర్తించి వారి వద్ద అధిక మొత్తంలో నగదు వసూలు చేసి జోబులను నింపుకుంటున్నారు కొందరు దళారులు. ఏడుకొండలపై పిఆర్‌ఓల పేరుతో కొందరు దళారులు భక్తులను బురిడీ కొట్టిస్తూ అందిన వరకూ దోచేస్తూ వేలకు వేలు దండుకుంటున్నారు. తాజాగా కాణిపాకం ఆలయంలో కాంట్రాక్టు గ్యాస్ ఆపరేటర్గా విధులు నిర్వర్తిస్తున్న కరుణాకర్ అనే దళారి మూడు వందల రూపాయలు విలువ గల సుపథం మార్గం దర్శనంను సేవగా భక్తులను నమ్మించి 12 సుపథం టిక్కెట్లను అధిక ధరకు విక్రయించిన దళారిని టీటీడీ విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దళారితో పాటుగా కాణిపాకం ఆలయ ఏఈవోను సైతం పోలీసులు విచారిస్తున్నారు. ప్రతి నిత్యం వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణలతో ఏడు కొండలు మారుమోగుతుంటాయి. స్వామి వారి దర్శనం పొందేందుకు ఎంత ఖర్చు పెట్టేందుకైనా వెనుకాడరు. స్వామి వారికి ఉన్న డిమాండ్ నే కొందరు క్యాష్ చేసుకుని కొందరు అమాయకులను నమ్మించి నిలువుగా దోపిడి చేస్తున్నారు. వైసీపి అధికారంలోకి వచ్చిన తరువాత టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి భాధ్యతలు చేపట్టిన తరువాత కొండపై దళారుల ఏరివేతకు టీటీడీ చర్యలు తీసుకుంది. భక్తులను మోసగించే దళారులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకున్నారు. దీంతో కొద్ది రోజుల పాటు నెమ్మకుండి పోయినా దళారులు కొత్త కొత్త ఆలోచనలతో, చాప కింద నీరులా భక్తులను మోసగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఔట్ సోర్సింగ్ లో గ్యాస్ ఆపరేటర్ గా కరుణాకర్ విధులు నిర్వహిస్తున్నాడు. కాణిపాకం ఆలయంలో గత కొద్ది రోజుల కిందట కొంత వివాదంలో చిక్కుకోవడంతో కరుణాకర్ ను ఆలయ అధికారులు సస్పెండ్ చేశారు. దీంతో తిరుమలలో కాణిపాకం ఆలయ పిఆర్‌ఓగా అవతారం ఎత్తాడు. కాణిపాకంలో పని చేస్తున్న సమయంలో ఉన్న పరిచయాలను ఉపయోగించుకుని సులభతరంగా డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేసుకున్నాడు. ముందస్తు ప్లాన్ ప్రకారం పరిచయం ఉన్న అధికారులు, రాజకీయ నాయకుల నుంచి దర్శనం సిఫార్సు లేఖలను పొంది దర్శనం లేని భక్తులను గుర్తించి వారి పేర్లతో టీటీడీ ఛైర్మన్ కార్యాలయం, జేఈవో కార్యాలయంలో కాణిపాకం ఆలయం పిఆర్‌ఓగా చెప్పకుంటూ దర్శనాలు పొందుతూ వచ్చేవాడు. ఈ టిక్కెట్లను సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు అధిక ధరలకు విక్రయించేవాడు. గతంలో కాణిపాకం ఈవోగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్ తన కుటుంబ సభ్యులకు దర్శనం కల్పించాలని టీటీడీకి లెటర్ పంపాడు. అందులో మరో ముగ్గురి పేర్లు చేర్చిన కరుణాకర్ వారి వద్ద అధిక డబ్బును వసూలు చేశాడు. ఈవో కుటుంబ సభ్యులతో పాటు వీరు ఎవరు అని విజిలెన్స్ సిబ్బంది ప్రశ్నించడంతో మూడు టిక్కెట్లు అమ్మేశాడని తేలింది. ప్రముఖ ఆలయం, తన పరువు పోతుందని, టీటీడీ విజిలెన్స్ సిబ్బందిని వెంకటేశ్ విన్నవించుకోవడంతో కరుణాకర్ ని మందలించి వదిలి పెట్టారు. అంతటితో ఆగకుండా తన కుటుంబ సభ్యులకు దర్శనంకు వెళ్ళేందుకు సిఫార్సు లేఖ కావాలని చెప్పి మరోసారి ఆలయంలోని ఓ అధికారి పేరు మీదుగా విఐపి బ్రేక్ దర్శనం టిక్కెట్లను పొంది వాటిని అధిక ధరలకు విక్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న కాణిపాకం ఆలయ ఈవో కరుణాకర్ ను పిలిచిగెట్టిగా మందలించాడు. కొద్దిరోజుల పాటు తన రహస్యంగా బయటి అధికారులు, రాజకీయ నాయకుల సిఫార్సు లేఖలపై దర్శనాలను పొందుతూ వాటిని విక్రయిస్తూ వచ్చేవాడు. సిఫార్సు లేఖ లభించక పోవడంతో తన కుటుంబ సభ్యులకు దర్శనం కల్పించాలంటూ కాణిపాకం ఆలయ ఏఈవో మాధవ్ రెడ్డిని కోరాడు. కాణిపాకం ఆలయంలోని అన్నదాన సత్రంలో గ్యాస్ ఆపరేటర్ గా పని చేసే సమయంలో కాణిపాకం ఆలయ ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న మాధవ్ రెడ్డి తో కరుణాకర్ కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఒకే ఆలయంలో పని చేస్తున్న వ్యక్తులు కావడంతో ఏఈవోతో మరింత స్నేహపూర్వకంగా మెలిగేవాడు కరుణాకర్. మాధవ్ రెడ్డి వద్ద లెటర్ హెడ్ పొందిన కరుణాకర్ కర్ణాటక రాష్ట్రం, చింతామణికి చెందిన కేశవమూర్తి కుటుంబసభ్యులను సంప్రదించాడు. శ్రీవారి వద్ద కూర్చొని ఉండే సేవ టిక్కెట్లు తీసిస్తానని నమ్మబలికాడు. ఒక్కో టికెట్ ధర రూ. 6000 వేలుగా బేరంఆడాడు. చివరికి ఒక్కో టికెట్ ధర రూ. 3300గా నిశ్చయించాడు. చివరకు ఆ భక్తులను సుపథం టిక్కెట్ల ద్వారా దర్శనానికి తీసుకెళ్లాడు. సేవ అని చెప్పి సుపథంకి తీసుకెళ్లాడని కరుణాకర్ పై పోలీసులకు పిర్యాదు చేసాడు కేశవమూర్తి. దింతో కరుణాకర్ ను అదుపులోకి తీసుకోని విచారణ చేపడుతున్నారు పోలీసులు. ఈ టిక్కెట్ల స్కాంకు సంబందించి కాణిపాకం ఆలయ ఏఈవో మాధవ్ రెడ్డిని అదుపులోకి తీసుకోని విచారణ చేపట్టారు పోలీసులు.

## ఆర్ కృష్ణయ్య ఒక బ్రోకర్

విశాఖపట్నం విశాఖ గర్జన ర్యాలీ సమ యంలోనూ ప్రతిపక్షాలు రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తే ... విద్యార్ధి గర్జన సమయంలో మీడియా సమా వేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ తీరు ను ఎండగట్టే ప్రయత్నం చేశారు. ఉత్త రాంధ్ర బీసీ సదస్సు అంటూ టిడిపి నేతలు మరోసారి వైసీపీని టార్గెట్ చేశారు. ఈ సదస్సులో పాల్గొన్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి ఆర్.కృష్ణయ్యపై నిప్పులు చేరిగారు. ఆర్ కృష్ణయ్య ఒక బ్రోకర్ అంటూనే,ఆర్ కృష్ణయ్య డబ్బులు తీసుకొని పదవులు ఇచ్చిన బీసీ ద్రోహి అని ద్వజమెత్తారు. ఆంధ్రుల ద్రోహి కృష్ణయ్య అని,రాష్ట్ర విభజన సమ యంలో ఆంధ్రులకు అన్యాయం జరి గినా మాట్లాడలేదని అన్నారు. టీడీ పి హయాంలో బిసిలు అభివృద్ధి చెందా రని చెప్పారు. మరోవైపు మాజీ మంత్రి కొల్లు రవీంధ్ర మాట్లాడుతూ 54 సాధి కార కమిటీ లు వేశామని,బిసి ల అభ్యున్నతి కోసం రాష్ట్ర వ్యాప్త పర్య టన చేసి ఒక నివేదిక రూపొందిస్తా మని చెప్పారు. బిసిలను అనగ తొక్క డానికి వైసిపి చూస్తోందని చెప్పారు. రాష్ట్రంలో రెడ్డీ సామాజిక వర్గీయుల హవా కొనసాగుతోందని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ బోర్డుతో సహా అన్ని పదవుల్లో వారిదే అగ్రస్థానమని, బిసిలను అనగదొక్కి రాజా రెడ్డి పైకి వచ్చారని,ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలోనే కాబట్టి కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని అన్నారు.

## టోకెన్ జారీ కేంద్రాలను పరిశీలించిన ఈఓ

తిరుపతితిరుపతిలోని సర్వదర్శన టోకెన్ జారీ కేంద్రాలను టీటీడీ ఈఓ ధర్మారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈరోజు అర్ధరాత్రి నుండి టీటీడీ టోకెన్లు జారీ చేయనుంది. సర్వదదర్శన టోకెన్ల జారీకి ఏర్పాట్లు అధికారులు పూర్తిచేసారు. టిటిడి ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, గోవింద రాజ సత్రాల్లో టోకెన్ల పంపిణీ చేస్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు, సదుపాయాలు ఏర్పాటు చేసారు. శని, ఆది, సోమవారాల్లో రోజుకు 25వేల టోకెన్ల జారీ చేస్తారు. మంగళ, బుధ, గురు, శుక్రవారాల్లో రోజుకు 15 వేల టోకెన్ల జారీ చేస్తారు. ఏరోజుకు ఆరోజు దర్శన టోకెన్ల జారీ చేయనున్నారు. టోకెన్లు అయిపోగానే కౌంటర్లు మూసివేస్తారు. టోకెన్ లేని భక్తులు తిరుమలకు వచ్చి సర్వదర్శనానికి వెళ్లవచ్చు. సర్వ దర్శన టోకెన్ల సంఖ్య క్రమంగా పెంచి భక్తులందరికీ ఇబ్బంది లేకుండా దర్శనం కల్పిస్తామని అన్నారు.

## నెల్లూరు లో మళ్లీ మర్డర్ కలకలం రేపింది.

నెల్లూరు నెల్లూరు లో మళ్లీ మర్డర్ కలకలం రేగింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గం కొండయ్యపాలెం గేట్ సెంటర్ హోటల్ టూరిజం వద్ద దారుణం జరిగింది. బుజ బుజ నెల్లూరుకి చెందిన రౌడీ షీటర్ అందే గిరిష్ కుమార్ దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. గిరిష్ ను ఆటోలో అనుసరిస్తూ గుర్తుతెలియని దుండగులు ఈ దురాగతానికి ఒడిగట్టినట్లు సమాచారం. నిందితుడి పై రెండు మర్డర్ కేసులు వున్నాయి. నెల్లూరు జంట నియోజకవర్గాల్లో పోలీసుల పనితీరు పై ప్రజల్లో అందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు ఎస్పీ పనిచేసి డిజిపి గా ఉన్న రాజేంద్రనాథ్ రెడ్డి నెల్లూరు నేరాల పై ధృష్టి పెట్టాలని ప్రతిపక్షలు డిమాండ్ చేస్తున్నాయి. పాత వివాదాల నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లు పోలీస్ అధికారుల సమాచారం. ప్రస్తుతం హత్యకు గురైన గిరిష్ కుమార్ వెంకటరెడ్డి నగర్ లో నివాసం ఉంటున్నాడు.

## బలహీన వర్గాలను అణచివేస్తున్న జగన్ మోహన్ రెడ్డి

విశాఖపట్నం బలహీన వర్గాలను ఉద్దే శపూర్వకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అణచివేస్తున్నా రని తెలుగుదేశం పార్టీ పొలిట్బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. విశాఖ నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఉత్త రాంధ్ర బీసీ సదస్సులో పాల్గొన్నారు. బీసీలను కట్టుబానిసలుగా చూస్తు న్నారని విమర్శించారు. ఉత్తరాంధ్రలో తమ పార్టీకి చెందిన బీసీ నాయకు లను జగన్మోహన్రెడ్డి వేధిస్తున్నారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చె న్నాయుడును, పొలిట్ బ్యూరో సభ్య డు చింతకాయల అయ్యన్నపాత్రుడు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తోపాటు మరికొందరు నాయకు లను జగన్మోహన్రెడ్డి వేధింపులకు గురిచేసి కేసులు పెట్టించారన్నారు. వైసీసీ అధి కారంలోకి వచ్చిన తరు వాత రాష్ట్రంలో అరాచక పాలన ప్రారంభమైందని, ఇప్పటివరకు బీసీలతోపాటు ఇతర వర్గాలపై 600కుపై గా దాడులు చేయిం చారని, మూడు వేల కేసులు పెట్టిం చారని ఆరోపించారు. ప్రభుత్వ దమన కాండను ప్రశ్నిం చినందుకు 30 మందిని పొట్టనబెట్టుకున్నా రన్నారు. ఏపీ లో బీసీలకు అండగా ఉంటామంటూనే తెలంగా ణకు చెందిన కృష్ణయ్యకు రాజ్యసభ పదవి కట్టబెట్టా రన్నారు. రాజ్యసభకు పంపేందుకు ఏపీలో బీసీలే లేరా అని రవీంద్ర ప్రశ్నించారు. తెలుగుదేశం హయాంలో బీసీ సంక్షే మానికి అనేక పథకాలు అమలు చేశామని గుర్తు చేశారు. టీడీపీ పాలనలో బీసీలకు ఎంత ఇచ్చాం?... అన్న దానిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, జగన్మో హన్రెడ్డి ప్రభుత్వం...బీసీ సంక్షేమానికి ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేస్తుందా? అని సవాల్ చేశారు. టీడీపీ పరంగా బీసీ వర్గాలను సమన్వయం చేయడా నికి సాధికార కమిటీలు వేశామని పేర్కొన్నారు. తమను వేధిస్తున్న ప్రభుత్వంపై బీసీ లంతా కలిసి తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు

## శ్రీవారి భక్తులకు తీపి కబురు

తిరుపతి,నవంబర్1(ఆర్ఎన్ఎ): తిరుమల,తిరుపతి దేవస్థానం శ్రీవారి భక్తులకు తీపి కబురును అందజేసింది. గతంలో కరోనా కంటే ముందు ఉన్న టైంస్లాట్ విధానాన్ని తిరిగి ప్రారంభించింది. తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం కాంప్లెక్స్, గోవిందరాజస్వామి సత్రాల వద్ద సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్ల జారీ పక్రియను పునఃప్రారంభించారు. శని, ఆది, సోమవారాల్లో 25 వేల టోకెన్లు, మిగతా రోజుల్లో రోజుకు 15 వేల టోకెన్లు జారీ చేయనున్నామని టీటీడీ అధికారులు వెల్లడించారు. టోకెన్ లభించిన భక్తుడు అదేరోజు దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేశారు. మూడు ప్రాంతాల్లో 30 కౌంటర్ల ద్వారా టోకెన్లు జారీ చేస్తామని, నిర్దేశిత కోటా పూర్తవగానే కౌంటర్లు మూసివేస్తామని వివరించారు. టోకెన్లు దొరకని భక్తులు

### టైంస్లాట్ విధానాన్ని తిరిగి ప్రారంభం

నేరుగా తిరుమల చేరుకుని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 ద్వారా స్వామివారిని దర్శించుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. టోకెన్ల జారీ పక్రియలో ఎదురయ్యే లోటుపాట్లను సరిదిద్దుకుంటూ క్రమంగా టోకెన్ల సంఖ్యను పెంచుతామని తెలిపారు. ఆధార్ నమోదు చేసుకుని టోకెన్లు జారీ చేయడం వల్ల భక్తులు దర్శనం చేసుకున్నా, చేసుకోకపోయినా నెలకు ఒకసారి మాత్రమే టోకెన్ పొందే అవకాశం ఉంటుందన్నారు. కరోనా తరువాత ఈ విధానాన్ని రద్దు చేసినా అధికారులు టైంస్లాట్ దర్శనం తిరిగి ప్రారంభించడం పట్ల భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఫైనాన్స్ కంపెనీ వేధింపులు..రైతు ఆత్మహత్య

నెల్లూరు ఓ ఫైనాన్స్ కంపెనీ వేధింపులతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. దొరవారిసత్రం మండలం అరిమాను కండ్రిగ గ్రామానికి చెందిన మద్దూరు జగన్నాథం (30) కు ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది బెదిరింపులు ఎదురయ్యాయి. ట్రాక్టర్ పై ఉన్న లక్ష రూపాయలు అప్పు వెంటనే చెల్లించాలని ఒత్తిడి చేసారు. పోలీస్ స్టేషన్ కు పిలిపించి వార్నింగ్ ఇచ్చారు. దాంతో జగన్నాథం మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసారు. తిరుపతిరూయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మా బిడ్డ ఆత్మహత్యకు ఫైనాన్స్ కంపెనీ, పోలీసులే కారణమంటున్న జగన్నాథం తల్లితండ్రులు ఆరోపించారు. వేదింపులకు పాల్పడ్డ ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## జనసేన క్యాడర్ చంద్రబాబుకి బానిసలా?

విశాఖపట్టణం, నవంబర్ 1, (న్యూస్ పల్స్)జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ని టార్గెట్ చేశారు మంత్రి గుడివాడ అమర్నాథ్. పవన్ కళ్యాణ్ కోసం కాపులు సమావేశం పెట్టినట్లు చిత్రీకరిస్తున్నారు. అన్ని వర్గాలతో మేము తరచు సమావేశాలు నిర్వహించుకున్నాం. జనసేన పొలిటికల్ పార్టీ కాదు సినిమా పార్టీ. విధానం సిద్ధాంతం లేని జనసేన పార్టీ. దాని గురించి మేము మాట్లాడవలసిన అవసరం లేదు. సినిమాల్లో ఉన్న వ్యక్తి సినిమా స్టైల్ లో మాట్లాడితే సినిమాల్లో పనికొస్తుంది. ప్రజాస్వామ్యంలో పనికిరాదు. దీన్ని సమాజం ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. పవన్ కళ్యాణ్ పదిమందితో ప్రభుత్వం వస్తుందా? జనసేన నేతలు కార్యకర్తలు పవన్ ముఖ్యమంత్రి కావాలనుకుంటే, పవన్ మాత్రం చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారు. చంద్రబాబుకి జనసేన సైనికులు బానిసలుగా బతకాలన్నారు మంత్రి అమర్నాథ్. పవన్ కంటే కేఏ పాల్ నయం? 175 సీట్లు పోటీ చేస్తాం అని చెబుతున్నాడు. చంద్రబాబు పవన్ కళ్యాణ్ కలియక ఎప్పుడో ఊహించినదే. వారు కలవడం విడిపోవడం సహజమే. కాపుల కోసం ముద్రగడ పోరాటం చేసినప్పుడు, పవన్ కళ్యాణ్ ఎక్కడికి వెళ్లాడు. అమరావతి రైతులు పాదయాత్ర పూర్తిగా మానుకోవాలని మేము కోరుతున్నాం అన్నారు మంత్రి అమర్నాథ్.విశాఖలో ఒత్సాహిక మహిళా పెట్టుబడిదారుల శిక్షణ సదస్సు ప్రారంభించారు ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్. కొరియన్ కోయికా..ఎపి అలీప్ ల మధ్య ఆహార ఉత్పత్తుల తయారీ పై అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మహిళా పారిశ్రామిక వేత్తలు కోసం విశాఖ లేదా అనకాపల్లి జిల్లాలో 25 ఎకరాల స్థలం కేటాయిస్తాం అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి మహిళా ఆర్థిక ప్రగతి పై ప్రత్యేక శ్రద్ద వుంది. ఈ రోజు భారత వ్యాపార రంగంలో 14 శాతం మహిళా పారిశ్రామిక వేత్తలు వున్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎపి టాప్ కేటగిరీ లో వుంది. కోడి గుడ్ల ఉత్పత్తి సేకరణ లో ఎపి నెంబర్ వన్ స్థానంలో వుంది. 60 శాతం గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ ఏపీలో జరుగుతోంది. మహిళా పారిశ్రామిక వేత్తలకు ఏపీ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు మంత్రి అమర్నాథ్.

## టోంకినీ అంజనేయస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొమురం భీం కొమురం భీం జిల్లా సిర్పూర్ (టీ) మండలం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం టోంకినీ ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. 21వ మహా పాదయాత్ర లో బాగంగా కాగజ్ నగర్ మండల కేంద్రం నుండీ 22 కిలోమీటర్ ల వరకు కాలినడకన బయలు దేరి ఆలయానికి చేరుకుంటున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేసారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

## స్నేహమంటే ఇదేరా కార్యక్రమం ఏర్పాటు చేసిన పరకాల దిన్నెగ్రామంలో విద్యార్థులు




ఎమ్మిగనూరునందవరం మండల పరిధిలోని మంగళవారం 1 నాడు స్నేహమంటే అంటే ఇదేరా . కార్యక్రమాన్ని కర్నూల్ జిల్లా నందవరం మండలం , పరకాల దిన్నె గ్రామం స్థానిక పాఠశాలలో కొంతమంది స్నేహితుల్లు తమ చిరకాల మిత్రుడు తమకు దూరం ఆయి ఒక సమస్తరం అయినా తమ మిత్రుడు ఆనంద్ మధ్యలోనే ఉన్నాడు అని స్నేహితులు తెలిప్యారు ,తమ మిత్రుడు పుట్టినరోజు సంద్రాభంగా ఆనంద్ పేరు మీద ఫ్రకల్ దిన్నె గ్రామం లొ విద్యార్థులతొ కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు,అలాగే అన్న ధన కారిక్రమా జెరిపి మరియు విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లు ,గ్లాసులు పంచడం జెరిగింది .ఈ సందర్బంగా అయినా మిత్రులు మాట్లాడుతూ ,దూరం అయినా మిత్రుడు ఆనంద్ కు ఈ విధంగా నీవర్నాలు అర్పించారు ,భవిషత్తులో మరి ఎనొ పుట్టినరోజు వేడుకలు జరుపుతామని ,అలాగే ఆనంద్ కుటుంబానికి అన్ని విధాలుగా అండ్ గా ఉంటాము అన్ని తెలిప్యారు .ఈ కరక్రమం లో కృష్ణ , తీమయ్య ,విరపక్షి ,భార్గవ్ ,సోమా శేఖర్ , హర్ష , వీరేష్ , ఉదయ్ ,రమేష్ , వెంకటేష్ , సాయి జెరిధర్ , నరేష్ , బాబ్లలు పాల్గొన్నారు .

## ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న డయాగ్నొస్టిక్ సెంటర్ లపై చర్యలు తీసుకోవాలి ఏఐవైఎఫ్

ఎమ్మిగనూరు పట్టణంలోని నవంబర్ 1 మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్ ల యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయడమే కాకుండా డయాగ్నొస్టిక్ సెంటర్లను సీజ్ చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరు పట్టణంలో పరిమిషన్ ఉన్నది ఒక సెంటర్కు అయితే నెలకొన్నది పదుల సంఖ్యలో ఉన్నాయని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పాలకొమ్మ రాజీవ్ ఏఐవైఎఫ్ తాలూకా ఉపాధ్యక్షుడు నరసింహులు నాయకులు నాగరాజు భరత్ రాజు కృష్ణ రమేష్ నాయుడు భీమేష్ నందు తదితరులు పాల్గొన్నారు

# విలువలు -విశ్వసనీయతతో కూడిన పరిపాలనే సీఎం జగన్ ధ్యేయం . .





నందికొట్కూరు. నవంబర్ 01.రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాల కాంతులు విరాజిల్లుతున్నాయని ,అభివృద్ధి లో ఆదర్శంగా గ్రామాలను తీర్చిదిద్దుతామని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలో మంగళవారం సర్పంచ్ మాధవరం సుశీలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నందికొట్కూరు శాసనసభ్యులు తొగురు ఆర్థర్ పాల్గొన్నారు. "గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం"లో భాగంగా ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను -పనితీరును వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్థర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో పారదర్శక -ఆదర్శ పాలన సాగిస్తున్నారని, ఎక్కడా కూడా కులాలు చూడకుండా మతాలు చూడకుండా, పార్టీ లు చూడకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నామని అన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విలువను విశ్వసనీయతతో కూడిన పరిపాలన చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఇచ్చిన హామిలలో 98 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. అందుకే ప్రజల హృదయాల్లో ఉత్తమ స్థానం సంపాదించుకున్నారన్నారు. ఏ ఒక్క సామాజిక వర్గానికి కొమ్ము కాయకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు ,ప్రజా సమస్యలను విన్నవించగానే తక్షణమే స్పందిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి మనం ఎల్లప్పుడూ తోడుగా నిలవాలని కోరారు. గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ పాఠశాల విద్యార్థులు తెలుగు నెలలు, వారాలు, ఎబిసిడి లు కూడా చెప్పకపోవడంతో ఉపాధ్యాయుల పై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీఓ శోభా రాణి, విద్యుత్ శాఖ ఏడీఏ శ్రీనివాస రెడ్డి, ఏఈ రాము నాయక్, మండల వ్యవసాయ అధికారి శ్రావణి, పశు వైద్యాధికారి నిర్మలా దేవి, హౌసింగ్ ఏఈ అరుణ్, ఇఓఆర్ పిడి సుబ్రహ్మణ్యం శర్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నజ్మా, నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ లు హరి సర్వోత్తమ రెడ్డి, సగినేల ఉసేనయ్య ,వైసీపీ నాయకులు మాధవరం ఏసు రత్నం, మాధవరం రత్నం, సంజన్న, వేల్పుల నాగన్న, మాజీ పోలీస్ అధికారి జయ చంద్ర, మహిళ నాయకురాలు డా.వనజ, వేల్పుల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసిన ఖండే శ్యామ్ సుందర్ లాల్

నంద్యాల :-. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాల కర్నూలు నంద్యాల ఆర్యవైశ్య సంఘం మరియు నంద్యాల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బింగమళ్ళ శ్యామ్ సుందర్ గుప్త, పొలిటికల్ చైర్మెన్ కండె శ్యామ్ సుందర్ లాల్, ఉపాధ్యక్షుడు జె వి సి ప్రసాద్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోమ్మంద్ర నాగరాజు, ఆర్యవైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు పాండు రంగ య్య, మండల సంఘం ప్రధాన కార్యదర్శి మలిపెద్ది నాగరాజు. మంగళవారం నాడు స్థానిక సంజీవ నగర్ కూడలి లోని అమరజీవి పొట్టి శ్రీరాములు గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ గుప్త మాట్లాడుతూ ఆర్యవైశ్య ముద్దుబిడ్డ అమరజీవి పొట్టి శ్రీరాములు గారు 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగ ఫలితమే ఈ రాష్ట్రం ఏర్పడిందన్నారు.. అలాగే అహింసా మార్గంలో స్వాతంత్రం కోసం పోరాడిన మన జాతిపిత మహాత్మా గాంధీ గారి గురించి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ గారు చేసిన అనుచిత వ్యాఖ్యలు చాలా బాధాకరంగా ఉన్నాయని తెలిపారు. నవంబర్ 1 తేదీని ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం అధికారికంగా జరుపుకోవాలని నిర్ణయించిన గౌరవ ముఖ్యమంత్రి వర్యులు వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి గారికి ధన్యవాదాలు,మరియు కూడలి లోని అమరజీవి పొట్టి శ్రీరాములు గారి విగ్రహం చుట్టూ ఆధునీకరణ చేసిన ఎం ఎల్ ఎ శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపారు.

## రాయలసీమ హక్కులు సాధించేవరకు పోరాటం ఆగదు

**-శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేయాల్సిందే**

**నవంబరు16 ఛలో విజయవాడకు తరలిరండి**

నంద్యాల :- రాయలసీమ హక్కులు సాధించేవరకు పోరాటం కొనసాగుతుందనీ, ప్రభుత్వం శ్రీబాగ్ ఒడంబడికను అమలు చేయాల్సిందేనని అక్టోబర్ 1 ననే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు.బండిఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామంలో మంగళవారం ఈ నెల 16 న విజయవాడలో జరిగే రాయలసీమ సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా బస్టాండు సెంటర్ లో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ...మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి 1953 అక్టోబర్ 1 న తెలుగు రాష్ట్రం ఏర్పడిందని రాయలసీమ హక్కుల పత్రం శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం ఆనాడు రాయలసీమ లోనే ఏర్పాటు చేసారని అయితే తెలంగాణా ప్రాంతం 1956 నవంబర్ 1 న ఆంధ్ర రాష్ట్రంలో కలవడంతో ఆంధ్రప్రదేశ్ గా ఏర్పడి కర్నూలులో ఉన్న రాజధానిని హైదరాబాదు కు తరలించి ఆనాడే రాయలసీమకు తీవ్ర అన్యాయం చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 జూన్ 2 న తెలంగాణ రాష్ట్రం విడిపోవడంతో 1953 అక్టోబర్ 1 న ఏర్పడిన ఆంధ రాష్ట్రమే నేడు ఆంధ్రప్రదేశ్ గా కొనసాగుతోందని రాష్ట్ర అవతరణ వేడుకలు నవంబరు 1 న నిర్వహిస్తూ శ్రీ బాగ్ ఒడంబడికను ప్రజలకు తెలియకుండా చేస్తున్నారనీ, రాయలసీమ హక్కుల పత్రం అమలుకాకుండా చేయడమేనన్నారు. చేరిన నవంబరు 1 న విడిపోయిన జూన్ 2 న ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకలు గత, ప్రస్తుత ప్రభుత్వాలు చేస్తూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డ అక్టోబర్ 1 ని విస్మరించడం బాధిస్తోందని రాయలసీమ ప్రజానీకం ప్రభుత్వ ద్వంద్వ విధానాలను గమనించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం అమరావతి కేంద్రంగా రాజధాని ఏర్పాటు చేసి అక్కడి స్థానికులకే ఉద్యోగ అవకాశాలు అంటూ రాయలసీమ పట్ల వివక్ష చూపి యువత భవిష్యత్తుకు తీవ్ర విఘాతం కలిగించిందని ఆయన గుర్తు చేసారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అసెంబ్లీ వేదికగా శ్రీబాగ్ ఒడంబడిక రాయలసీమ హక్కుల పత్రాన్ని అమలు చేస్తామని ప్రకటించి కర్నూలుకు న్యాయ రాజధాని అంటూ ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టకుండా మభ్యపెడుతోందని విమర్శించారు. శ్రీబాగ్ ఒప్పందంలో కీలకమైన కృష్ణా జలాలు రాయలసీమకు ప్రథమ ప్రాధాన్యత ఉన్నా వాటిని పట్టించుకోకుండా కరువుకు కారణమవుతున్నారని ఆయన విమర్శించారు. రాయలసీమ అభివృద్ధిని అడ్డుకుంటున్న అధికార, ప్రతిపక్ష పార్టీల పెద్దల పోకడలను రాయలసీమ ప్రజానీకం గమనిస్తున్నారనీ తగిన సమయంలో బుద్ధి చెప్పే రోజులు ఆసన్నమయ్యాయని అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమకు జాతీయ స్థాయి వైద్య విద్యాలయం, వ్యవసాయ విశ్వ విద్యాలయం, బుందేల్ ఖండ్ తరహా ముప్పైవేల కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీ, గుంతకల్లు రైల్వే జోన్ , కడప ఉక్కు కర్మాగారం పట్ల సమైక్యవాదులు ఎందుకు నోరు మెదపడం లేదని దశరథరామిరెడ్డి నిలదీశారు.

# విజయ్ 'వారసుడు' రాంగ్ టైం లో దిగుతోందా?




కోలీవుడ్ సూపర్ స్టార్ ఇళయ దళపతి విజయ్ కు టాలీవుడ్ లోనూ మంచి మార్కెట్ ఉంది. భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఈ నేపథ్యంలోనే ఆయన ప్రతి సినిమాను తమిళంతో పాటు తెలుగులోనూ విడుదల చేస్తున్నారు. అయితే ప్రస్తుతం విజయ్ ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లితో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.అదే 'వారిసు(తెలుగులో వారసుడు)'. వంశీ పైడిపల్లికి ఇది 6వ చిత్రం కాగా.. విజయ్ కు 66వ ప్రాజెక్ట్ కావడం విశేషం. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు శిరీష్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ స్వరాలు అందిస్తున్నాడు. ఇందులో రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తుంటే.. ప్రభు శరత్ కుమార్ శ్రీకాంత్ ప్రకాష్ రాజ్ ఖుష్బూ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా తెలుగు తమిళ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కాబోతోంది. అయితే మొదట వారసుడు విజయ్ తెలుగులో చేస్తున్న డైరెక్ట్ చిత్రమని అన్నారు. ఆ తర్వాత బై లింగ్యువల్ మూవీ అన్నారు. తాజాగా వంశీ పైడిపల్లి ఇది పక్కా తమిళ చిత్రం అంటూ క్లారిటీ ఇచ్చారు. తెలుగులో డబ్ చేసి విడుదల చేస్తామని వెల్లడించారు.కానీ తెలుగులో ఈ చిత్రానికి ఇప్పటికైతే ఎలాంటి బజ్ నెలకొనలేదు. పైగా సంక్రాంతి బరిలో ప్రభాస్ 'ఆదిపురుష్' చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' బాలకృష్ణ 'వీరసింహారెడ్డి' లాంటి భారీ సినిమాలు ఉండడంతో విజయ్ 'వారసుడు' వైపు ఎవరు కన్నెత్తి కూడా చూడటం లేదు. నిజానికి విజయ్ సినిమా వస్తోందంటే తమిళంతో పాటు తెలుగులోనూ మంచి హైప్ ఏర్పడేది.అయితే వారసుడు విషయంలో అందుకు భిన్నంగా సాగుతోంది. దానికి తోడు వారసుడు సినిమా పోస్టర్స్ ప్రోమోలు చూస్తుంటే వంశీ పైడిపల్లి గత చిత్రం 'మహర్షి'కి మరో వెర్షన్ మాదిరి కనిపిస్తోందని టాక్ నడుస్తోంది. దీంతో విజయ్ సినిమాకు తెలుగులో జీరో బజ్ నెలకొంది. ఇక కోలీవుడ్ లో ఈ సినిమాకు బాగానే క్రేజ్ ఏర్పడింది.కానీ 'వారసుడు'కు పోటీగా అజిత్ కుమార్ నటించిన 'తునివు' దిగబోతోంది. వలిమై డైరెక్టర్ హెచ్.వినోత్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ భారీ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే ఎన్నో అంచనాలు నెలకొన్నాయి. ఈ లెక్కన విజయ్ 'వారసుడు' పొంగల్ వార్లో దిగితే.. టాక్ ఎంత బాగున్నా తమిళంతో పాటు తెలుగులోనూ బాక్సాఫీస్ వద్ద హెవీ క్లాషెస్ వచ్చే అవకాశాలు ఎంతైనా ఉంటాయి. ఒకవేళ పొరపాటున టాక్ తేడాగా వస్తే ఇక అంతే సంగతులు. ఈ నేపథ్యంలోనే వారసుడు రాంగ్ టైం లో దిగుతోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సమంత కారణంగా విజయ్ మరో ప్లాన్



బ్యూటిఫుల్ హీరోయిన్ సమంత మయోసైటిస్ అనే వ్యాధితో బాధపడుతున్నట్లు తెలియడంతో అందరూ కూడా ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. ఆమె గతంలోని ట్రీట్మెంట్ కోసం పలు దేశాలకు వెళ్ళింది. బహుశా ఏదైనా సర్జరీ కోసం వెళ్లి ఉండవచ్చు అని కూడా కథనాలు చాలానే వచ్చాయి. కానీ ఇంతకాలం సమంత ఆ విషయాన్నీ ఎక్కడ చెప్పింది లేదు. కానీ మొదటిసారి ఆమె యశోద సినిమాకు సంబంధించిన డబ్బింగ్ పనులను కొనసాగిస్తూ కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అసలు విషయం తెలిసింది.ఇక సమంత ఈ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవాలని సినీ ప్రముఖులు అభిమానులు అందరూ కూడా కోరుకుంటున్నారు. అయితే ప్రస్తుతం యశోద సినిమా విడుదలకు సిద్ధమవుతుండగా సమంత అనారోగ్యం వలన పూర్తి చేయాల్సిన ఖుషి ప్రాజెక్ట్ హోల్డ్ లో పడే అవకాశం అయితే ఉంది. ఈ ప్రాజెక్టును డిసెంబర్లోనే విడుదల చేయాలని అనుకున్నారు.కానీ ఇప్పుడు సమంత ఆరోగ్య విషయం తెలిసిన తర్వాత మళ్లీ అనుకున్న సమయానికి సినిమా విడుదలవుతుందా లేదా అనేది కాస్త సందేహంగా మారింది. దానికి తోడు విజయ్ దేవరకొండ ఇప్పుడు మళ్లీ గ్యాప్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ గ్యాప్ లోనే విజయ్ సమయాన్ని వృధా చేయకుండా మరొక ప్రాజెక్టును మొదలుపెట్టాలని అనుకుంటున్నాడు. జెర్సీ దర్శకుడు గౌతమ్ తిన్ననూరితో ఒక సినిమా చేసేందుకు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే.ఈ ఐనిమాను దిల్ రాజు నిర్మించబోతున్నాడు. అయితే సమంత కోలుకునే లోపు ఈ సినిమా ప్రాజెక్టుకు సంబంధించిన ఒక షెడ్యూల్ ని కూడా ఫినిష్ చేయాలని అనుకుంటున్నారు. ఇక మళ్ళీ సమంత కోలుకున్న తర్వాత ఒకవైపు ఖుషి సినిమా షూటింగ్ చేస్తూనే మరొకవైపు ఈ ప్రాజెక్టును కూడా పూర్తి చేయాలని విజయ్ ప్లాన్ చేస్తున్నాడు.దాదాపు ఖుషి సినిమాకు సంబంధించి కీలక సన్నివేశాలు అన్నీ కూడా పూర్తయ్యాయి. సమంతతో మరో ఎపిసోడ్ మాత్రమే మిగిలి ఉంది. ఇక దాన్ని పూర్తి చేస్తే విజయ్ దేవరకొండ ఖుషి సినిమాకు గుమ్మడికాయ కొట్టేసినట్లే. ఇక ఈ గ్యాప్ లోనే గౌతమ్ ప్రాజెక్టును కూడా మొదలుపెట్టి వచ్చే ఏడాది సమ్మర్ తరువాత ఆ ప్రాజెక్టును ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలి అని విజయ్ ప్రణాళికలు రచిస్తున్నారు.


# చరణ్ కి నాన్ ఆర్ఆర్ఆర్ రికార్డ్

ఆర్ ఆర్ ఆర్ సినిమా తర్వాత రామ్ చరణ్ నటిస్తున్న చిత్రం పై అందరి దృష్టి ఉంది. ప్రముఖ తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో చరణ్ సినిమా చేస్తున్న కారణంగా అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. రాజమౌళి కి ఏమాత్రం తగ్గడు అంటూ శంకర్ పై మెగా అభిమానులు నమ్మకంతో ఉన్నారు.వందల కోట్ల వసూళ్లను చరణ్.. శంకర్ కాంబో మూవీ రాబట్టడం కన్ఫర్మ్ అన్నట్లుగా అభిమానులు మాట్లాడుకుంటున్నారు. దేశ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా ఆర్ సీ 15 సినిమా పై అంచనాలు భారీగా ఉన్నాయి. ముఖ్యంగా ఈ సినిమాను యూఎస్ లో అన్ని ఇండియన్ భాషల్లో విడుదల చేయడానికి మంచి డిమాండ్ ఉది. ఈ సినిమా ను నిర్మిస్తున్న దిల్ రాజు ఇప్పటికే సినిమా యొక్క ప్రీ రిలీజ్ బిజినెస్ ను మొదలు పెట్టేశాడు అంటూ వార్తలు వస్తున్నాయి. అందులో భాగంగా ఈ సినిమా యొక్క యూఎస్ థియేట్రికల్ రైట్స్ ను ప్రముఖ పంపిణీ సంస్థకు అమ్మేసినట్లుగా తెలుస్తోంది.ఇండస్ట్రీ వర్గాల వారు మాట్లాడుకుంటున్న దాని ప్రకారం ఆర్ సీ 15 సినిమాను యూఎస్ లో పంపిణీ చేసేందుకు గాను దాదాపుగా



17.2 కోట్ల రూపాయలను సదరు సంస్థ దిల్ రాజుకు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుందట.ఆర్ ఆర్ ఆర్ సినిమా కాకుండా రామ్ చరణ్ నటించిన ఏ ఒక్క సినిమా కూడా ఈ స్థాయిలో యూఎస్ లో ప్రీ రిలీజ్ బిజినెస్ చేయలేదు. దాంతో చరణ్ నాన్ ఆర్ ఆర్ ఆర్ రికార్డును నమోదు చేశాడు అంటూ మెగా వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఆర్ సీ 15 సినిమా తో కలెక్షన్స్ విషయంలో కూడా నాన్ ఆర్ ఆర్ ఆర్ సినిమా రికార్డును చరణ్ దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయిదు వందల కోట్లకు పైగా చరణ్ ఈ సినిమా తో రాబడితే బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్నట్లే అంటూ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

# బుమ్రా ఇకపై ఐపీఎల్ మాత్రమే ఆడతాడా..?



టీ20 వరల్డ్కప్-2022 తర్వాత టీమిండియా వెళ్లబోయే రెండు విదేశీ పర్యటనల కోసం సెలెక్షన్ కమిటీ నిన్న (అక్టోబర్ 31) వేర్వేరు జట్లను ప్రకటించిన విషయం తెలిసిందే.వరల్డ్కప్ ముగిసిన వెంటనే భారత్.. నవంబర్ 18 నుంచి 30 వరకు న్యూజిలాండ్లో, ఆతర్వాత డిసెంబర్ 4 నుంచి 26 వరకు బంగ్లాదేశ్లో పర్యటించనుంది. తొలుత జరుగబోయే న్యూజిలాండ్ పర్యటనలో భారత్ 3 టీ20లు, 3 వన్డేలు ఆడనుండగా.. టీ20 జట్టుకు హార్దిక్ పాండ్యా, వన్డే జట్టుకు శిఖర్ ధవన్ కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. అనంతరం బంగ్లాదేశ్ పర్యటనలో టీమిండియా 3 వన్డేలు, రెండు టెస్ట్ మ్యాచ్లు ఆడాల్సి ఉండగా.. రెండు ఫార్మాట్లలో రోహిత్ శర్మ సారథిగా వ్యవహరించనున్నాడు.ఈ రెండు పర్యటనల కోసం ప్రకటించిన జట్లలో పేసు గుర్రం జస్ప్రీత్ బుమ్రా పేరు కనిపించకపోవడంతో భారత క్రికెట్ అభిమానులు రకారకాల అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. అసలు బుమ్రాకు ఏమైంది.. ఇంతకీ అతను అంతర్జాతీయ క్రికెట్ ఆడతాడా.. లేక ఐపీఎల్కు మాత్రమే పరిమితమవుతాడా అన్న సందేహాన్ని తెరపైకి తెస్తున్నారు. టీ20 వరల్డ్కప్కు ముందు సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్ సందర్భంగా గాయపడిన బుమ్రా.. నెలలు గడుస్తున్నా జట్టులోకి తిరిగి రాకపోవడాన్ని గట్టిగా ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఫిట్గా ఉన్నా సెలెక్టర్లు అతన్ని పరిగణలోకి తీసుకోవట్లేదా అన్న కోణంలో కూడా విచారిస్తున్నారు.2016లో అంతర్జాతీయ క్రికెట్లోకి అరంగేట్రం చేసిన 28 ఏళ్ల బుమ్రా ఇప్పటివరకు 30 టెస్ట్లు, 72 వన్డేలు, 56 టీ20లు మాత్రమే ఆడాడు. బుమ్రా తన ఆరేళ్ల కెరీర్లో ఇన్ని తక్కువ మ్యాచ్లు ఆడటాన్ని అభిమానులు చాలా రోజులుగా ప్రశ్నిస్తూనే ఉన్నారు. మరోవైపు 2013లో ఐపీఎల్ అరంగేట్రం చేసిన బుమ్రా.. ఆడిన ప్రతి సీజన్లో ఒక్క మ్యాచ్ కూడా మిస్ కాకుండా ఇప్పటివరకు 120 మ్యాచ్లు ఆడాడు. ఐపీఎల్పై ఇంత శ్రద్ధ పెట్టే బుమ్రా.. అంతర్జాతీయ మ్యాచ్లపై ఫోకస్ పెట్టకపోవడం పట్ల అభిమానులు చింతిస్తున్నారు.ఆరేళ్ల అంతర్జాతీయ కెరీర్లో అతను క్రమం తప్పకుండా అన్ని ఫార్మాట్లు ఆడింది వేళ్లపై లెక్కపెట్టవచ్చని ఆధారాలతో సహా చూపిస్తున్నారు. రెస్ట్ అనో లేక గాయాల పేరుతోనో కీలక సిరీస్లకు అందుబాటులో ఉండకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న టీ20 వరల్డ్కప్ కోసం హడావుడిగా జట్టులోకి వచ్చిన బుమ్రా.. అంతే హడావుడిగా ఎగ్జిట్ అవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.ఈ పరిమాణాల నేపథ్యంలో అసలు బుమ్రాకు అంతర్జాతీయ క్రికెట్? ఆడే ఉద్దేశం ఉందా లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఐపీఎల్ మాత్రమే ఆడాలనుకుంటే అంతర్జాతీయ క్రికెట్కు గుడ్బై చెప్పి ఇష్టమొచ్చిన లీగ్లో ఆడుకొవచ్చని సలహా ఇస్తున్నారు. ఓ పక్క నాణ్యమైన పేసర్ లేక భారత జట్టు సతమతమవుతుంటే.. ఆ బాధ బుమ్రాకు తెలుస్తుందా అని నిలదీస్తున్నారు. దేశం ఎట్లైనా పోని డబ్బే కావాలనుకుంటే హాయిగా ఐపీఎల్కు మాత్రమే పరిమితం కావచ్చని సూచిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**